Follow: @ANNTELUGU

05-03-2026

# మహా పత్రిక

ANN తెలుగు

గురువారం, హైదరాబాద్ సంపుటి- 23 సంచిక- 67 పేజీలు-08 వెల-రూ.6

PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM



## అమిత్ షాతో సీఎం రేవంత్ రెడ్డి భేటీ

### మావోయిస్టు అగ్రనేతల ప్రతిపాదనలపై చర్చ

**తెలంగాణకు అదనంగా ఐపీఎస్ అధికారులను కేటాయించాలని రిక్వెస్ట్**

**ఢిల్లీ, మహా :** కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో సీఎం రేవంత్ రెడ్డి బుధవారం రాత్రి భేటీ అయ్యారు. ఈ సమావేశంలో సీఎంతో పాటు రాష్ట్ర డీజీపీ శివధర్ రెడ్డి, ఇంటెలిజెన్స్ ఐజీ సుమతి, అడిషనల్ డీజీ విజయ్ కుమార్ పాల్గొన్నారు. 2026 మార్చి నాటికి దేశాన్ని నక్సలిజం నుంచి విముక్తం చేసేందుకు కేంద్రం నిర్దేశించుకున్న 'మావోయిస్టు రహిత భారత్' లక్ష్యంపై ఈ సమావేశంలో సుదీర్ఘంగా చర్చించారు. అనంతరం మావోయిస్టుల లొంగుబాటుపై సీఎం రేవంత్ రెడ్డి, హోంమంత్రి అమిత్ షాకు నివేదికను అందజేశారు. ఇటీవల తెలంగాణ పోలీసుల ఎదుట లొంగిపోయిన మావోయిస్టు అగ్రనేతలు తిప్పిరి తిరుపతి అలియాస్ దేవ్ జీ, మల్లా రాజిరెడ్డి, నూనె నర్సింహారెడ్డి ఇచ్చిన ప్రతిపాదనలపై చర్చించినట్లుగా తెలుస్తోంది.

మిగతా 2లో

టాప్ న్యూస్

### ఆపిల్ నుంచి కొత్త మ్యాక్‌బుక్

- రోజంతా బ్యాటరీ... ఏఐ పనుల కోసం ప్రత్యేక ప్రాసెసర్
- రూ.69,900 ప్రారంభ ధరతో మార్కెట్లోకి విడుదల



02

### స్పీకర్ నోటీసులు అందలేదు

- ఎమ్మెల్యే దానం నాగేందర్ సంచలన వ్యాఖ్యలు



02

### నువ్వు హిందువైతే భార్యతో తిరుమలకు రా

- జగన్‌కు బీఆర్ నాయుడు సవాల్



02

# రాజ్యసభకు వేం నరేందర్ రెడ్డి

### ఫోన్ ద్వారా హైకమాండ్ సమాచారం..

## నేడు నామినేషన్

- సన్నిహితుడికి పదవిపై నెగ్గిన రేవంత్ మాట
- 2004-09 మధ్య ఎమ్మెల్యేగా పనిచేసిన వేం నరేందర్ రెడ్డి
- 17 ఏళ్ళ తర్వాత మళ్ళీ చట్టసభకు.. సింఘ్వీకి రెన్యువల్



**హైదరాబాద్, మహా :** తెలంగాణ కాంగ్రెస్.. రాజ్యసభ అభ్యర్థుల పేర్లు పార్టీ అధిష్టానం ఖరారుచేసింది. తెలంగాణ నుంచి రాజ్యసభకు వేం నరేందర్ రెడ్డి, అభిషేక్ మను సింఘ్వీ పేర్లను ప్రకటించింది. దీంతో వీరిద్దరూ గురువారం నామినేషన్ల దాఖలు చేయనున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి అత్యంత సన్నిహితుడైన వేం నరేందర్ రెడ్డికి గత రెండేళ్ళలో అనేక అవకాశాలు మిస్ కాగా, ఎట్టకేలకు ముఖ్యమంత్రి పట్టుదలతో రాజ్యసభకు మార్గం సుగమమైంది. 2004 2009 మధ్య ఎమ్మెల్యేగా ఉన్న వేం నరేందర్ రెడ్డి తెలంగాణ ఆవిర్భావం నుండి రేవంత్ కు అత్యంత ఆత్మీయుడిగా మారారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చేందుకు, రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయ్యేందుకు వేం నరేందర్ రెడ్డి తన శక్తిమేర కృషి చేశారు. సీఎం ఆలోచనలను క్షేత్రస్థాయిలో అమలు చేసే వేం నరేందర్ రెడ్డికి ఎట్టకేలకు రాజ్యసభ ఖరారు కావడంపై పార్టీ వర్గాల్లో హర్షం వ్యక్తమవుతోంది.

మిగతా 2లో

### సోనియా, ఖర్గే, రాహుల్ కు థ్యాంక్స్

**రాజ్యసభకు ఎంపికపై వేం నరేందర్ రెడ్డి హర్షం**

కాంగ్రెస్ పార్టీ రాజ్యసభ అభ్యర్థిగా తనను ఖకారుచేయడంపై వేం నరేందర్ రెడ్డి ఆనందం వ్యక్తం చేశారు. తనను ఎంపిక చేసిన సోనియాగాంధీ కి,కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే కి,లోక్ సభలో ప్రతిపక్ష నాయకులు రాహుల్ గాంధీ కి, ఏఐసీసీ సెక్రటరీ కేసీ వేణుగోపాల్ కి,ఎంపీ ప్రియాంక గాంధీ కి,ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి,తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్ కి,ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకి, పీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ కి కాంగ్రెస్ పార్టీ అధిష్టానానికి వేం నరేందర్ రెడ్డి హృదయ పూర్వక ధన్యవాదాలు తెలిపారు.



## ఇరాన్ యుద్ధనౌకపై అమెరికా దాడి

### 87 మంది మృతి

- ఇరాన్ యుద్ధవిమానాన్ని కూల్చేసిన ఇజ్రాయెల్
- యుద్ధంలో ఏఐ వినియోగిస్తున్న అమెరికా
- ఇరాన్ లో వేయి దాటిన మృతులు
- దాడుల భయంతో ఖమేనీ అంత్యక్రియలు వాయిదా

**మహా నెట్ వర్క్,**

ఇజ్రాయెల్ బుధవారం తెల్లవారుజాము నుంచే టెహ్రాన్‌పై పెద్దఎత్తున విరుచుకుపడింది. రాజధాని నగరం చుట్టూ భారీ పేల్లులు వినిపించినట్టు ఇరాన్ టెలివిజన్ రిపోర్ట్ చేసింది. ఇరాన్ నుంచి వచ్చే క్షిపణులను అడ్డుకునేందుకు ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్‌ను యాక్టివేట్ చేసినట్టు ఇజ్రాయెల్ తెలిపింది. జెరూసలేం సమీపంలో కూడా పేలుళ్లు వినిపించాయి. ఇప్పటిదాకా ఇరాన్ లో వేయిమందికి పైగా అమెరికా, ఇజ్రాయెల్ దాడుల్లో మరణించారు.

మిగతా 2లో

### సుప్రీం ఎవరైనా నిర్మూలిస్తాం

**ఇజ్రాయెల్ సంచలన ప్రకటన**

ఇజ్రాయెల్‌ను నాశనం చేయాలనుకునే వారిని వదిలే ప్రసక్తేలేదు

2లో



### 'విరోష్' వెడ్డింగ్ రిసెప్షన్

**తారల తళుకులు**

రాజకీయ ప్రముఖుల మెరుపులు

ప్రత్యేక కథనం 4లో



### సింగూరు డ్యామ్ సేఫ్టీ పనులపై సమీక్ష

- ఉగాదిలోగా పెద్దారెడ్డి లిఫ్ట్ స్కీమ్‌కు శంకుస్థాపన
- ఆందోల్ నియోజకవర్గంలో 40 వేల ఎకరాలకు సాగునీరు
- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

వివరాలు 8లో



### డీఎంకేతో డీల్ ఫైనల్

**కాంగ్రెస్‌కు 28 సీట్లు, ఒక రాజ్యసభ సీటు**

**చెన్నై, మహా :** తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో మిత్ర పక్షమైన డీఎంకేతో కాంగ్రెస్ మరోసారి కలిసి పోటీ చేస్తోంది. సీట్ల పంపకాల్లో భాగంగా కాంగ్రెస్‌కు 28 అసెంబ్లీ సీట్లతో పాటు ఒక రాజ్యసభ సీటును డీఎంకే ఆఫర్ చేసింది. సీట్ల పంపకాల అంశంపై డీఎంకే అధ్యక్షుడు ఎంకే స్టాలిన్‌తో కూడా కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే ఫోనులో మాట్లాడినట్టు సమాచారం. దీంతో డీల్ ఫైనల్ అయింది. తమిళనాడులో 234 అసెంబ్లీ స్థానాలు ఉండగా, డీఎంకేతో కూటమిలో భాగంగా 30 సీట్లకు తగ్గేది లేదని కాంగ్రెస్ పట్టుబడుతూ వచ్చింది. దీంతో సీట్ల పంపకాలపై పరిష్కారానికి డీఎంకేతో సంప్రదింపులు జరిపే బాధ్యతను కాంగ్రెస్

మిగతా 2లో

## రాజీనామా దిశగా నితీశ్ కుమార్

### బీహార్ రాజకీయాల్లో పెనుమార్పులు

**రాజ్యసభలో అడుగుపెట్టే ఛాన్స్.. డిప్యూటీగా తనయుడు**

**పాట్నా:** బీహార్ రాజకీయాల్లో సంచలన పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ తన పదవికి రాజీనామా చేసి రాజ్యసభలో అడుగుపెట్టే అవకాశాలున్నాయని, అలాగే నితీశ్ తనయుడు నిషాంత్ కుమార్ బిహార్ ఉప ముఖ్యమంత్రి అవుతారని ప్రచారం జరుగుతోంది. తద్వారా నితీశ్ కుమార్ స్థానంలో బీజేపీ తమ సొంత అభ్యర్థిని ముఖ్యమంత్రిగా నియమించే అవకాశం ఉందని చెబుతున్నారు. నిషాంత్ కుమార్‌ను రాజ్యసభకు నామినేట్ చేయవచ్చనే ప్రచారం కూడా ఇంతకు ముందు జరిగింది. అయితే ఇంతవరకూ ఆయన అభ్యర్థిత్వానికి సంబంధించి ఎలాంటి డాక్యుమెంట్లు సిద్ధం కాలేదు. నిషాంత్ కుమార్ యాక్టివ్ పాలిటిక్స్‌లోకి అడుగుపెట్టడం ఖాయమని మాత్రం జేడీయూ వర్గాలు చెబుతున్నాయి. బిహార్‌లో 5 రాజ్యసభ స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. జేడీయూ రెండు స్థానాలకు గెలుచుకునే అవకాశం ఉంది. జేడీయూ శాసనసభా పక్షం కూడా గురువారం నాడు సమావేశమవుతోంది. ఈ సమావేశంలో కేంద్రంలో



నితీశ్ ప్రధాన పాత్ర పోషించడానికి అంగీకరించే విషయంపై చర్చ జరగవచ్చని తెలుస్తోంది. రాజ్యసభలో అడుగుపెట్టడంతో పాటు త్వరలో కేంద్రమంత్రిగా నితీష్ బాధ్యతలు తీసుకునే అవకాశాలున్నాయి.



### ఈ ఏడాది వేసవి నిప్పుల కొలిమే..

**భగభగలాడుతున్న భానుడు**

**రాష్ట్రంలో పెరిగిన ఎండ తీవ్రత**

**హైదరాబాద్, మహా:** ఈ ఏడాది అపుడే ఎండలు దంచికొడుతున్నాయి. ఉత్తర తెలంగాణలో ఈ ఏడాది ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రకటించింది. గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతాయని తెలిపింది. ఉత్తర తెలంగాణలో ఈ సంవత్సరం అధిక వర్షపాతంతో పాటు చలి తీవ్రత ఎక్కువగా ఉంది కనుక గరిష్ఠ ఉష్ణోగత్రలు ఉంటాయని తెలిపింది. ఇప్పటికే రాష్ట్రంలో 33 నుంచి 39 డిగ్రీల మేర ఉష్ణ తీవ్రత నమోదవుతుందని రాగల రెండు రోజుల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు రెండు నుంచి నాలుగు డిగ్రీల మేర పెరుగుతాయని ఐఎండీ అధికారి ధర్మరాజు తెలిపారు. గతేడాదితో పోలిస్తే ఈ సంవత్సరం ఉష్ణోగ్రత కాస్త భిన్నంగా ఉండే అవకాశం ఉంది. ముఖ్యంగా ఉత్తర, దక్షిణ తెలంగాణ జిల్లాల్లో ఎండ తీవ్రత వ్యత్యాసం స్పష్టంగా కనిపిస్తుంది.

మిగతా 2లో

### హైదరాబాద్‌లో భారీగా కల్తీ నెయ్యి స్వాధీనం

2లో

Scan here.
Step Forward. Get Recognized. Be Celebrated.

## స్పీకర్ నోటీసులు అందలేదు

**ఎమ్మెల్యే దానం నాగేందర్ సంచలన వ్యాఖ్యలు**

**హైదరాబాద్, మహా :** పార్టీ ఫిరాయింపుల అంశంలో భాగంగా ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్‌పై స్పీకర్ చేపట్టిన విచారణపై ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ స్పందించారు. బుధవారం ఆయన హైదరాబాద్ లోని మీడియాతో మాట్లాడుతూ అనర్హత పిటిషన్ పైన తనకు స్పీకర్ నుంచి ఎలాంటి నోటీసులు అందలేదని సంచలన వ్యాఖ్యలు చేశారు. స్పీకర్ తనకు నోటీసు అందజేస్తే తన అభిప్రాయం ఏమిటనేది ఆయనకే చెప్తానని దానం స్పష్టం చేశారు.

## సింగూరు డ్యామ్ సేఫ్టీ పనులపై సమీక్ష

**హైదరాబాద్, మహా :** రాష్ట్రంలోని ప్రతిష్ఠాత్మక సింగూరు ప్రాజెక్టు పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని రాష్ట్ర మంత్రులు అధికారులను ఆదేశించారు. బుధవారం సచివాలయంలో భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధ్యక్షతన ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం జరిగింది. ఈ భేటీలో రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ, మెదక్ ఉమ్మడి జిల్లా ఇన్చార్జి మంత్రి వివేక్ వెంకటస్వామి, ఇరిగేషన్ శాఖ ముఖ్య అధికారులు పాల్గొన్నారు. నేషనల్ డ్యామ్ సెక్యూరిటీ సంస్థ రూపొందించిన నిబంధనల మేరకు సింగూరు డ్యామ్ పరిరక్షణ పనులను వెంటనే చేపట్టాలని నిర్ణయించారు. ఇందుకోసం ప్రత్యేకంగా ఒక టెక్నికల్ కమిటీని నియమించాలని మంత్రులు సూచించారు. అదేవిధంగా జూలై నెలాఖరులోగా రైతులకు సాగునీరు అందించడమే లక్ష్యంగా పనులు సాగాలన్నారు. సింగూరు ప్రాజెక్టు కాలువల లైనింగ్ పనులను జూన్ 26లోగా పూర్తి చేయాలని డెడ్‌లైన్ విధించారు.



**ఆందోల్ కు సాగునీరు**

ఆందోల్ నియోజకవర్గంలో 40 వేల ఎకరాలకు సాగునీరు అందించే పెద్దారెడ్డి లిఫ్ట్ స్కీమ్‌కు డీపీఆర్‌లను శరవేగంగా సిద్ధం చేయాలని అధికారులకు మంత్రి ఉత్తమ్ సూచించారు. ఉగాది పండుగ లోపు ఈ పనులకు శంకుస్థాపన చేయాలని అధికారులను ఆదేశించారు. సింగూరు ప్రాజెక్టు పరిరక్షణతో పాటు, పర్యాటక పరంగా ప్రాజెక్టు సుందరీకరణ పనులను సాధ్యమైనంత వేగంగా పూర్తి చేయాలని మంత్రులు స్పష్టం చేశారు. ఆందోల్ నియోజకవర్గంలోని చిన్న నీటి ప్రాజెక్టులైన చెరువుల పునరుద్ధరణకు టెండర్లు పూర్తి చేసి, ఈ సీజన్‌లోనే రైతులకు నీరందించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఇరిగేషన్ శాఖ ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి ఈ.శ్రీధర్, ఈఎన్సీలు రమేష్ బాబు, శ్రీనివాస్, టి.శ్రీనివాస్, సంగారెడ్డి జిల్లా ఇరిగేషన్ శాఖ ఎస్ఈబీ. రాజమ్మ, ఇతర ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

## అమిత్ షాతో సీఎం రేవంత్ రెడ్డి భేటీ

(మొదటిపేజీ తరువాయి)

ఈ సందర్భంగా అపరేషన్ కగార్‌కు తెలంగాణ పోలీసులు సహరించారని అమిత్ షా అన్నట్లుగా సమాచారం. ఆపరేషన్ పూర్తి అయ్యేంత వరకు ఇలాగే సహకరించాలని సీఎం రేవంత్ రెడ్డికి సూచించినట్లుగా తెలుస్తోంది. అదేవిధంగా మిగతా మావోయిస్టులు కూడా లొంగిపోయేలా చూడాలని.. తెలంగాణలో ఈగల్ టీమ్‌ను బలోపేతం చేయాలని అమిత్ షా, సీఎం రేవంత్‌కు దిశానిర్దేశం చేసినట్లుగా సమాచారం. ఇక ఫ్యూచర్ సిటీ కమిషనరేట్ ఏర్పాటును సీఎం రేవంత్ రెడ్డి, అమిత్ షాకు వివరించారు.

**తెలంగాణకు ఐపీఎస్ లను పెంచాలి**

తెలంగాణ రాష్ట్ర అవసరాలకు అనుగుణంగా ఐపీఎస్ అధికారుల సంఖ్యను కేటాయించాలని కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షాకు ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర విభజన అనంతరం 2016లో మొదటి క్యాడర్ రివ్యూ జరిగిందని... 2021లో జరగాల్సిన క్యాడర్ రివ్యూ చాలా ఆలస్యంగా 2025లో జరిగిందన్నారు. ఆ సమయంలోనూ కేవలం 7 గురు ఐపీఎస్ అధికారులను మాత్రమే తెలంగాణకు కేటాయించారని సీఎం వివరించారు. దేశంతో పాటు తెలంగాణ రాష్ట్రం సైబర్ నేరాలు, డ్రగ్స్, వైట్ కాలర్ నేరాలు సహా ఇతర అనేక ఆధునిక సవాళ్లను ఎదుర్కొంటోందని సీఎం తెలిపారు. హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజిగిరి కమిషనరేట్ల పునర్వ్యవస్థీకరణ, ఫ్యూచర్ సిటీ కమిషనర్, హైదరాబాద్ నగరంలో భారీగా పెరుగుతున్న జనాభా నేపథ్యంలో పెద్ద సంఖ్యలో ఐపీఎస్ అధికారుల అవసరం ఉందని కేంద్ర మంత్రి అమిత్ షాకు సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. మూడో క్యాడర్ రివ్యూను నిర్దేశిత 2026 సంవత్సరంలోనే చేపట్టాలని కేంద్ర మంత్రికి సీఎం విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం 83 ఐపీఎస్ అధికారులు రాష్ట్రంలో ఉన్నారని... ఆ సంఖ్యను 105 కు పెంచి కేటాయించాలని సీఎం కోరారు.

## ఈ ఏడాది వేసవి నిప్పుల కొలిమే..

(మొదటిపేజీ తరువాయి)

ఫిబ్రవరి మొదటి వారంలోనే ఉక్కపోత వాతావరణం ఉంటుంది. ఇప్పటికే ఉత్తర తెలంగాణ జిల్లాల్లో 39 డిగ్రీల వరకు ఉష్ణోగ్రత కొనసాగుతుంది. దక్షిణ తెలంగాణ జిల్లాల్లో 33 నుంచి 34 డిగ్రీల వరకు ఎండ తీవ్రత కొనసాగుతోంది. క్రమేపీ ఎండ తీవ్రత పెరిగే అవకాశం కనిపిస్తోంది. గతంతో పోలిస్తే 2 నుంచి మూడు డిగ్రీలు మేర అధికంగా నమోదయ్యే అవకాశం ఉంది అని అధికారులు తెలిపారు.

## ఆపిల్ నుంచి కొత్త మ్యాక్‌బుక్

### రోజంతా బ్యాటరీ... ఏఐ పనుల కోసం ప్రత్యేక ప్రాసెసర్
### రూ. 69,900 ప్రారంభ ధరతో మార్కెట్లోకి విడుదల

**మహా :** టెక్ దిగ్గజం ఆపిల్ తన ల్యాప్‌టాప్ శ్రేణిలో మరో కొత్త ఉత్పత్తిని మార్కెట్లోకి విడుదల చేసింది. 'మ్యాక్‌బుక్ నియో' పేరుతో వచ్చిన ఈ సరికొత్త ల్యాప్‌టాప్‌ను బుధవారం లాంచ్ చేసింది. ఏఐ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) ఆధారిత పనులను వేగంగా చేసేందుకు వీలుగా శక్తిమంతమైన ఏ18 ప్రో చిప్‌ను ఇందులో అమర్చారు. 13 అంగుళాల లిక్విడ్ రెటినా డిస్‌ప్లే దీని ప్రధాన ఆకర్షణగా నిలుస్తోంది. ఒక్కసారి ఛార్జ్ చేస్తే 16 గంటల వరకు నిరంతరాయంగా రోజంతా పనిచేసే బ్యాటరీ లైఫ్‌ను ఈ మ్యాక్‌బుక్ నియో అందిస్తుంది. వీడియో కాల్స్ కోసం 1080p ఫేస్‌టైమ్ హెచ్‌డీ కెమెరా, స్పష్టమైన ఆడియో కోసం డ్యూయల్ మైక్స్, స్పేషియల్ ఆడియో సపోర్ట్‌తో డ్యూయల్ సైడ్‌ఫైరింగ్ స్పీకర్లను పొందుపరిచారు. సౌకర్యవంతమైన టైపింగ్ కోసం మ్యాజిక్ కీబోర్డును, సులభమైన కంట్రోల్ కోసం పెద్ద మల్టీటచ్ ట్రాక్‌ప్యాడ్‌ను ఇచ్చారు. మ్యాక్‌బుక్ నియోను దృఢమైన అల్యూమినియం బాడీతో రూపొందించారు. ఇది బ్లష్, ఇండిగో, సిల్వర్, కొత్తగా సిట్రస్ రంగుల్లో అందుబాటులో ఉంటుంది. కేవలం 2.7 పౌండ్ల (సుమారు 1.22 కిలోలు) బరువుతో దీన్ని ఎక్కడికైనా సులభంగా తీసుకెళ్లవచ్చు. భారత్‌లో మ్యాక్‌బుక్ నియో ప్రారంభ ధర రూ. 69,900గా నిర్ణయించారు. విద్యార్థుల కోసం ప్రత్యేకంగా రూ. 59,900కే అందిస్తున్నారు. అమెరికాతో సహా 30 దేశాల్లో ప్రీఆర్డర్లు ప్రారంభమయ్యాయి. మార్చి 11 నుంచి ఆపిల్ స్టోర్లు, అధీకృత విక్రయ కేంద్రాల్లో ఇది అందుబాటులోకి వస్తుంది. "తక్కువ ధరలోనే మ్యాక్ అనుభూతిని అందించాలనే లక్ష్యంతో మ్యాక్‌బుక్ నియోను తీసుకొచ్చాం" అని ఆపిల్ హార్డ్‌వేర్ ఇంజనీరింగ్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ జాన్ టెర్నస్ తెలిపారు. "అద్భుతమైన డిజైన్, శక్తిమంతమైన పనితీరు, రోజంతా పనిచేసే బ్యాటరీతో ఇంతటి ల్యాప్‌టాప్‌ను కేవలం ఆపిల్ మాత్రమే తయారు చేయగలదు" అని ఆయన వివరించారు.

## 48 గంటల్లో 15 లక్షల మంది యూజర్లను కోల్పోయిన ఓపెన్‌ఏఐ

- అమెరికా రక్షణ శాఖలో ఏఐ మోడల్స్ వినియోగానికి ఓపెన్‌ఏఐ ఒప్పందం
- యూజర్ల తీవ్ర అసంతృప్తి.. చాట్‌జీపీటీ నుంచి వాకౌట్

**మహా :** సామ్ ఆల్ట్ మన్ నేతృత్వంలోని ఓపెన్‌ఏఐ తన ఏఐ మోడళ్లను ఉపయోగించుకోవడానికి అమెరికా డిపార్ట్‌మెంట్ ఆఫ్ డిఫెన్స్‌కు అనుమతించడంతో ఆ సంస్థకు ఎదురుదెబ్బ తగిలింది. అమెరికా రక్షణ శాఖలో తమ ఏఐ మోడల్స్ వినియోగానికి ఓపెన్‌ఏఐ పెంటగాన్‌తో ఒప్పందం కుదుర్చుకుంది. ఈ ఒప్పందం కుదిరిన 48 గంటల్లో ఆ సంస్థకు చెందిన ఏఐ చాట్‌బాట్ చాట్‌జీపీటీ నుంచి 15 లక్షల మంది వినియోగదారులు వైదొలిగారు. అయితే ఇందుకు సంబంధించి సంస్థ నుంచి అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది. మిలటరీ ఆపరేషన్‌లలో ఏఐ వినియోగానికి మద్దతు ఇవ్వడం పట్ల యూజర్లు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఓపెన్‌ఏఐని వీడటంతో పాటు కొంతమంది సబ్‌స్క్రిప్షన్ రద్దు చేసుకుంటున్నారు. ఈ దెబ్బతో యాప్ స్టోర్ ర్యాంకింగ్‌లో చాట్‌జీపీటీని ఆంత్రోపిక్స్ క్లాడ్ అధిగమించింది. మొదట ఆంత్రోపిక్ క్లాడ్ మోడల్స్‌ను తమ సైన్యం అపరిమితంగా ఉపయోగించుకునేలా యాక్సెస్ ఇవ్వాలని పెంటగాన్ డిమాండ్ చేసింది. ఈ చర్య ప్రజాస్వామ్య విధానాలకు విరుద్ధమని ఆంత్రోపిక్ సీఈవో డారియో అమోడెయ్ తిరస్కరించారు. తమకు యాక్సెస్ ఇవ్వని ఆంత్రోపిక్‌తో వ్యాపారం చేయబోమని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. దీంతో ఆంత్రోపిక్ ప్రత్యర్థి సంస్థ ఓపెన్‌ఏఐతో పెంటగాన్ ఒప్పందం కుదుర్చుకుంది.

## నువ్వు హిందువైతే భార్యతో తిరుమలకు రా

**జగన్‌కు బీఆర్ నాయుడు సవాల్**

**తిరుపతి, మహా :** తమరు హిందువే అయితే భార్యతో కలిసి తిరుమలకు రావాలని మాజీ సీఎం జగన్ మోహన్ రెడ్డికి టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు సవాల్ విసిరారు. బీఆర్ నాయుడిని ఉద్దేశించి జగన్ చేసిన ట్వీట్‌కు ఆయన స్ట్రాంగ్ ఇచ్చారు. జగన్ సతీసమేతంగా తిరుమల కు రాలేరని, ఆయన్ను ఎవ్వరూ నమ్మరని ఎక్స్ వేదికగా బీఆర్ నాయుడు సైతం ట్వీట్ చేశారు. జగన్ క్రిస్టియన్ అని జగమెరిగిన సత్యమని, హిందుత్వంపై మాట్లాడే అర్హత ఆయనకు లేదన్నారు. దేవదేవుడు వేంకటేశ్వర స్వామిపై ఎలాపడితే అలా మాట్లాడతావా అంటూ బీఆర్ నాయుడు ఫైర్ అయ్యారు. శ్రీవారి పేరు ఉచ్చరించే అర్హత, నైతికత నీకుందా జగన్ అని బీఆర్ నాయుడు నిలదీశారు. 'హిందూ వ్యతిరేకి అయిన నువ్వు అప్పుడు సీఎంగా ఉన్నావనే కదా నీ అనుచరులకి ధైర్యం. అందుకే వైవీ సుబ్బారెడ్డి, భూమన కరుణాకరరెడ్డి రెచ్చిపోయి హిందూ మత ఔన్నత్యాన్ని మంటగలిపారు. ఒక పథకం ప్రకారం తిరుమల కొండపై యథేచ్ఛగా అన్యమత ప్రచారం చేశారు. అన్యమతస్తుడవైన నువ్వు ఇప్పటివరకు దేవదేవునిపై విశ్వాసం ఉందని డిక్లరేషన్ ఎందుకు ఇవ్వలేదు?. సీఎంగా ఉండగా నీ భార్యతో కలిసి గుడికి వచ్చి పట్టు వస్త్రాలిచ్చావా?. రాలేదే. మీ జీవితంలో భార్యతో కలిసి తిరుమలకు రాలేవు. ఎందుకంటే మీ ఇద్దరూ నమ్మేది ఏసుప్రభువునే.. వేంకటేశ్వర స్వామిని కాదు. ఇది ఒప్పుకో జగన్.... నేను చైర్మన్ అయ్యాక ముఖ్యమంత్రి చంద్రబాబు ఆలోచనల మేరకు టీటీడీని ప్రక్షాళన చేస్తున్నాం. నీ అండతో నీ బాబాయ్, భూమన చేసిన అవినీతి, అక్రమాలు బయట పడుతున్నాయి. టీటీడీలో అన్యమతస్తులు ఉండరాదని నేను నిర్ణయం తీసుకున్న నాడే నాపై పథకం ప్రకారం కుట్రలు ప్రారంభించావు. అందులో భాగంగానే కదా నాపై డీప్ ఫేక్ వీడియోలు సృష్టించి తిరుమల ప్రతిష్ట దెబ్బతీయాలని చూశావు. వేంకటేశ్వర స్వామిని ఇంటిదైవంగా పూజించే చంద్రబాబుకి దేవదేవునిపై భక్తి లేదంటావా?. చంద్రబాబు భార్య తో తిరుమలకు వస్తారు. నువ్వు హిందూ వే అయితే భార్యతో తిరుమలకు రా.'' బీఆర్ నాయుడు సవాల్ విసిరారు.

## డీఎంకేతో డీల్ ఫైనల్

(మొదటిపేజీ తరువాయి)

సీనియర్ నేత పి.చిదంబరానికి పార్టీ అధిష్ఠానం అప్పగించింది.

**డీఎంకేతో చర్చలు**

కాగా, తమిళనాడు ఎన్నికల్లో అరవింద్ కేజ్రీవల్ సారథ్యంలోని ఆమ్ ఆద్మీ పార్టీ తొలిసారి ఎన్నికల బరిలోకి దిగనుంది. డీఎంకేతో కలిసి పోటీ చేసేందుకు ఆప్ నిర్ణయం తీసుకుంది. సీట్ల పంపకాలపై ఆ పార్టీతో చర్చలు జరుపుతోంది. దీనిపై తమిళనాడు ఆప్ కన్వీనర్ ఎస్ఏఎన్ వశీగరణ్ మీడియాతో మాట్లాడుతూ, డీఎంకే సమన్వయ కమిటీని కలిసామని, కొన్ని సీట్లు అడిగామని చెప్పారు. బీజేపీని అడ్డుకోవడానికి బలమైన కూటమి అవసరమన్నారు. గత పర్యాయం పార్లమెంటు ఎన్నికల్లో బలమైన విపక్ష కూటమి ఏర్పడిందని, అందులో ఆప్ కూడా ఉందని గుర్తుచేశారు. తమిళనాడులో డీఎంకేతో పొత్తుతో ముందుకు వెళ్లాలనుంటున్నామనీ, కేజ్రీవాల్ సైతం ఎంకే స్టాలిన్‌తో మాట్లాడతారని, కచ్చితంగా తమ పార్టీకి గణనీయమైన సీట్లు దక్కుతాయని ఆశిస్తున్నామని చెప్పారు.

## సంతాన వేణుగోపాలస్వామి కళ్యాణం కమనీయం..

**సంతాన భాగ్యం కోసం భక్తుల రద్దీ.. వైభవంగా కళ్యాణ మహోత్సవం**



**మణుగూరు, మహా :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు మండలం రామానుజవరం గ్రామంలో స్వయంభుగా వెలిసిన కాకతీయుల కాలంనాటి శ్రీ రుక్మిణి సత్యభామ సమేత సంతాన వేణుగోపాలస్వామి వారి కళ్యాణ మహోత్సవం బుధవారం ఆధ్యాత్మిక వాతావరణంలో అత్యంత వైభవంగా, కమనీయంగా నిర్వహించారు. సంతాన భాగ్యం కోసం భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని ప్రత్యేకంగా ఆరాధించి, కళ్యాణ మహోత్సవాన్ని కనులారా తిలకించారు. ఈ సందర్భంగా అనంతరం అన్నదాన కార్యక్రమంలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించాలని ఆలయ కమిటీ చైర్మన్ వత్సవాయి రామరాజు, వైస్ చైర్మన్ నోముల రవి, కమిటీ సభ్యులు భక్తులను కోరారు.

**మణుగూరు మున్సిపాలిటీలో..**

మణుగూరు మున్సిపాలిటీ పరిధిలోని పాత మణుగూరు సమీపంలో గల శ్రీ వేణుగోపాలస్వామి ఆలయంలో వేణుగోపాల స్వామి కళ్యాణ మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా వేదమంత్రోచ్చారణల మధ్య నిర్వహించారు. కళ్యాణాన్ని తిలకించేందుకు మణుగూరు ఏరియాతోపాటు ఇతర ప్రాంతాల నుండి భక్తులు పెద్ద ఎత్తున హాజరై స్వామివారి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ గాండ్ల సురేష్, పాతూరు వెంకన్న, కందిమల్ల రామయ్య, ఎల్ఐసి ఏజెంట్ ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## పదేపదే ఐఏఎస్ ల బదిలీలు

**మాజీ మంత్రి హరీష్ రావు ఫైర్**

**హైదరాబాద్, మహా :** సీఎం రేవంత్‌రెడ్డికి పరిపాలన రావడం లేదని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు విమర్శించారు. ఐఏఎస్, ఐపీఎస్‌లను పదేపదే బదిలీ చేస్తున్నారని పేర్కొన్నారు. ''రెండున్నరేళ్లలో ఐదుసార్లు భారీ ఎత్తున అధికారులను బదిలీ చేశారు. తరచూ బదిలీలతో పాలన కుంటుపడుతోంది. పరిస్థితులు అర్థం చేసుకునేలోపే అధికారులు బదిలీ అవుతున్నారు. జీహెచ్ఎంసీ కమిషనర్లు కూడా ఇప్పటికే నలుగురు మారారు. కలెక్టర్ల సదస్సులో సీఎం బెదిరింపు ధోరణిలో మాట్లాడారు. సీఎం, మంత్రులకు నచ్చకపోతే అధికారులను వెంటనే బదిలీ చేస్తున్నారు. ఐఏఎస్, ఐపీఎస్‌లను సీఎం బెదిరిస్తున్నారు. కొందరికి పోస్టింగులు ఇచ్చి కూడా జాయిన్ చేసుకోవడం లేదు. కాంగ్రెస్ నేతల అవినీతి, బినామీలను త్వరలోనే బయటపెడతాం'' అని హరీశ్‌రావు అన్నారు.

## రాజ్యసభకు వేం నరేందర్ రెడ్డి

(మొదటిపేజీ తరువాయి)

ఎంతో నిబద్ధతతో, క్రమశిక్షణతో సీఎం కు సంబంధించిన భారాన్ని మీద వేసుకోవడంతో పాటు నేతలను సమన్వయం చేయడంలో, లక్ష్యాలు సాధించడంలో వేం నరేందర్ రెడ్డిది ప్రత్యేక శైలి.

**రెండూ కాంగ్రెస్ కే**

కాంగ్రెస్ పార్టీకి తెలంగాణ నుంచి రెండు రాజ్యసభ స్థానాలు దక్కనున్నాయి. ఈ రెండు స్థానాలకు కాంగ్రెస్ లో మొదటి నుంచి కూడా తీవ్రమైన పోటీ ఉంది. సుప్రీం కోర్టులో సీనియర్ అడ్వకేట్ అయిన అభిషేక్ సింఘ్వికి మరోసారి అవకాశం ఇవ్వాలని పార్టీ అధిష్టానం నిర్ణయించింది. లాస్ట్ టర్మ్ లో ఏడాదిన్నర మాత్రమే ఆ పదవిలో ఉన్నందున రెండోసారి కూడా సింఘ్వికి అవకాశం ఇచ్చింది కాంగ్రెస్ హైకమాండ్. ఇక రెండో స్థానం కోసం కాంగ్రెస్ లో తీవ్రమైన పోటీ నెలకొంది. ఫైనల్ గా సీఎం రేవంత్ రెడ్డి రాజకీయ సలహాదారు వేం నరేందర్ రెడ్డిని అభ్యర్థిగా కాంగ్రెస్ అధిష్టానం ఫైనల్ చేసింది. వేం నరేందర్ రెడ్డి చాలా కాలంగా పార్టీకి విశేషమైన సేవలు అందిస్తున్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని హైకమాండ్ ఆయనకు అవకాశం ఇచ్చింది. గురువారం నామినేషన్ వేసేందుకు సిద్ధంగా ఉండాలని పార్టీ హైకమాండ్ నరేందర్ రెడ్డికి ఫోన్ చేసి చెప్పినట్లు సమాచారం. గురువారం ఉదయం 11 గంటలకు వేంనరేందర్ రెడ్డి, అభిషేక్ సింఘ్విలు అసెంబ్లీలో నామినేషన్ వేయనున్నారు. గతంలో రెండుసార్లు ఎమ్మెల్సీ అవకాశం, ఒకసారి రాజ్యసభ అవకాశం ఈ రెండేళ్ళలో మిస్ కాగా, ఎట్టకేలకు ఇపుడు దానికి సంబంధించిన సమయం ఆసన్నమైంది. రాష్ట్రంలోని పెద్దల సభకు రావాలనుకుంటే పార్టీ దేశంలోని అత్యున్నత సభకు ఎంపికచేసింది.

## హైదరాబాద్ లో భారీగా కల్తీ నెయ్యి స్వాధీనం

**మహా:** హైదరాబాద్ నగర నడిబొడ్డున సాగుతున్న కల్తీ నెయ్యి దందా గుట్టును టాస్క్‌ఫోర్స్ పోలీసులు రట్టు చేశారు. బంజారాహిల్స్ పరిధిలోని ఒక నివాస ప్రాంతంలో గుట్టుచప్పుడు కాకుండా జరుగుతున్న ఈ వ్యవహారంపై అధికారులు మెరుపు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో పోలీసులు సుమారు 460 కిలోల కల్తీ నెయ్యిని స్వాధీనం చేసుకున్నారు. దీని మార్కెట్ విలువ సుమారు రూ. 18.26 లక్షల వరకు ఉంటుందని అధికారులు అంచనా వేశారు. ప్రముఖ బ్రాండ్ల పేర్లతో ఉన్న నకిలీ ప్యాకెట్లు, సీళ్లు, ప్యాకేజింగ్ యంత్రాలను పోలీసులు సీజ్ చేశారు. వినియోగదారులను మోసం చేసేలా ఈ ప్యాకేజింగ్ చేస్తున్నట్లు గుర్తించారు. తక్కువ ధరకు వచ్చే నూనెలు, రసాయనాలు కలిపి ఈ నెయ్యిని తయారు చేస్తున్నట్లు ప్రాథమిక దర్యాప్తులో తేలింది. స్వాధీనం చేసుకున్న నెయ్యి నమూనాలను ల్యాబ్ పరీక్షల కోసం పంపిన అధికారులు, నిందితులపై కేసులు నమోదు చేసి దర్యాప్తు ముమ్మరం చేశారు.

## ఇరాన్ యుద్ధనౌకపై అమెరికా దాడి



(మొదటిపేజీ తరువాయి)

ఇరాన్ ఇజ్రాయెల్, అమెరికా దేశాల మధ్య తీవ్రస్థాయిలో ఉద్రిక్తతలు కొనసాగుతున్న వేళ హిందూ మహాసముద్రంలో ఇరాన్ యుద్ధనౌకపై అమెరికా జలాంతర్గామి చేసిన దాడిలో 87 మంది మృతిచెందినట్టు రాయిటర్స్ మీడియా తెలిపింది. మృతుల సంఖ్య పెరిగే అవకాశమున్నట్టు తెలుస్తోంది. ప్రమాదానికి గురైన సమయంలో ఆ నౌకలో మొత్తం 180 మంది సిబ్బంది ఉన్నట్టు సమాచారం. శ్రీలంక చేపట్టిన సహాయక చర్యల్లో భాగంగా ఇప్పటివరకు 32 మందిని రక్షించగా.. గల్లంతైన మిగిలిన వారి ఆచూకీ తెలియాల్సి ఉంది. పశ్చిమాసియలో ఉద్రిక్తతల నేపథ్యంలో శ్రీలంక దక్షిణ తీరానికి సమీపంలో జరిగిన ఈ ఘటన ప్రస్తుతం అంతర్జాతీయంగా తీవ్ర చర్చనీయాంశమైంది. ఇరాన్‌కు చెందిన ఐఆర్ఐఎస్ దేనా అనే ఈ యుద్ధనౌక కొన్ని వారాల క్రితం.. భారత్‌లోని విశాఖపట్నంలో జరిగిన 'మిలాన్2026' విన్యాసాల్లో పాల్గొని తిరిగి వెళ్తుండగా ఈ దాడి జరిగినట్లు తెలుస్తోంది. ఇక ఖమేనీ అంత్యక్రియలు బుధవారం జరపాలని భావించినా, పెద్ద ఎత్తున వచ్చే ప్రజలపై మళ్ళీ దాడులు జరిగితే నష్టం తీవ్రంగా ఉంటుందని ప్రభుత్వం వాయిదావేసింది.

**యుద్ధవిమానాన్ని కూల్చేసిన ఇజ్రాయెల్**

ఇరాన్ రాజధాని టెహ్రాన్‌పై వైమానికి దాడులతో ఇజ్రాయెల్ బుధవారం నాడు భీకరంగా విరుచుకుపడింది. ఇరాన్‌కు చెందిన యాక్130 యుద్ధ విమానాన్ని టెహ్రాన్ గగనతలంలో ఇజ్రాయెల్ అడ్వాన్స్‌డ్ ఎఫ్35 (ఎఫ్35) యుద్ధవిమానం కూల్చేసింది. ఎఫ్35 ఫైటర్ జెట్ ఒక మానవ సహిత శత్రు విమానాన్ని గగనతలంలో కూల్చివేయడం ఇదే తొలిసారని ఇజ్రాయెల్ రక్షణ దళం తెలిపింది. ఇజ్రాయెల్ ఎఫ్35 స్పెషల్ వెర్షన్ యుద్ధ విమానాన్ని అమెరికా డిఫెన్స్ కంపెనీ లాక్‌హీడ్ మార్టిన్ నిర్మించింది. ప్రపంచంలోని అత్యంత అడ్వాన్స్‌డ్ యుద్ధవిమానాల్లో ఇది ఒకటిగా చెబుతారు. రాడార్‌లు కనిపెట్టడానికి వీలులేని విధంగా ప్రత్యేక ఫీచర్స్‌తో దీన్ని రూపొందించారు. ప్రత్యేకమైన ఆకారంలో, ఇంటర్నల్ వెపన్స్ స్టోరేజీ, సెన్సార్లు, ఫ్యూయెల్ సిస్టమ్ కలిగి ఉంటుంది. కాగా, యాక్130ను రెండు సీట్లతో ట్రైనింగ్, లైట్ కంబాట్ జెట్‌గా రష్యా రూపొందించింది. ప్రధానంగా దీనిని పైలట్ల శిక్షణకు ఉపయోగిస్తారు. పోరాటాల సమయంలో ఆయుధాలు తీసుకువెళ్లేందుకు కూడా దీనిని ఉపయోగిస్తుంటారు. ఇక అమెరికా యుద్ధంలో ఏఐని వినియోగిస్తోంది. ఓపెన్‌ఏఐని యుద్ధంలో వినియోగించడంపై ప్రజలు ఆగ్రహంగా ఉన్నారు.

## సుప్రీం ఎవరైనా నిర్మూలిస్తాం..

- ఇజ్రాయెల్ సంచలన ప్రకటన
- ఇజ్రాయెల్‌ను నాశనం చేయాలనుకునే వారిని వదిలే ప్రసక్తేలేదు

**మహా:** ఇరాన్ తదుపరి సుప్రీం లీడర్‌గా ఎంపికయ్యే వ్యక్తిని కూడా నిర్మూలించడమే లక్ష్యంగా పెట్టుకుంటామని ఇజ్రాయెల్ రక్షణ మంత్రి కాట్జ్ సంచలన ప్రకటన చేశారు. ఇజ్రాయెల్, అమెరికా సంయుక్తంగా జరిపిన దాడిలో సుప్రీం లీడర్ అలీ ఖమేనీ మృతి చెందిన విషయం తెలిసిందే. ఖమేనీ మృతి చెంది నాలుగు రోజులైనా అమెరికా, ఇజ్రాయెల్ దాడులు ఆపడం లేదు. ఇలాంటి సమయంలో ఇజ్రాయెల్ మంత్రి నుంచి ఈ కీలక ప్రకటన వచ్చింది. ఇజ్రాయెల్‌ను నాశనం చేయాలనుకునే వారిని, అమెరికాను బెదిరించే ప్రయత్నం చేసే వారిని వదిలిపెట్టే ప్రసక్తి లేదని అన్నారు. ఈ ప్రాంతంతో పాటు ప్రపంచ దేశాలను అణిచివేయడానికి, బెదిరించడానికి ఆ దేశ ప్రభుత్వం నియమించిన ఏ నాయకుడినైనా నిస్సందేహంగా అంతం చేస్తామని స్పష్టమైన ప్రకటన చేశారు. సుప్రీం లీడర్‌గా కొత్తగా ఎవరు ఎన్నికైనా, ఎక్కడ దాక్కున్నా వదిలి పెట్టబోమని అన్నారు. అమెరికా భాగస్వామ్యంతో, ఇరాన్ పాలన సామర్థ్యాలను తుడిచిపెట్టేస్తామని హెచ్చరించారు. ఖమేనీ రెండో కుమారుడు ముజ్తబాను దేశ సుప్రీం లీడర్‌గా ఇరాన్ అసెంబ్లీలోని కీలక నేతలు ఎన్నుకున్నట్లు వార్తలు వచ్చాయి. ఇస్లామిక్ రెవల్యూషనరీ గార్డ్ కోర్ (ఐఆర్జీసీ)తో బలమైన సంబంధాలు కలిగిన అతను త్వరలో బాధ్యతలు చేపడతారని తెలుస్తోంది. ఈ క్రమంలో ఇజ్రాయెల్ నుంచి కీలక ప్రకటన వెలువడింది.

## మొట్లగూడెంలో బ్యాంకు అధికారుల విచారణ

- బకాయిపడ్డ లోన్ తో మాకు సంబంధం లేదని గ్రూప్ సభ్యుల స్టేట్మెంట్
- అక్రమార్కుల పై చర్యలు తీసుకోవాలని లిఖిత పూర్వకంగా డిమాండ్

**కారేపల్లి, మహా:** మొట్లగూడెం అక్రమంపై తెలంగాణ గ్రామీణ బ్యాంక్ ఉన్నతాధికారులు ఎట్టకేలకు విచారణ చేపట్టారు. తెలంగాణ గ్రామీణ బ్యాంక్ ఆర్ఎం ఆఫీస్ డెస్క్ ఆఫీసర్ లింగమల్లు బుధవారం మొట్లగూడెం గ్రామంలో విచారణ నిర్వహించారు. ఇప్పటికే బ్యాంక్ నుంచి నోటీసులు జారీ చేసిన స్వరాజ్, వినాయక గ్రూప్ కు సంబంధించిన సభ్యులతో మాట్లాడారు.

**లిఖితపూర్వకంగా గ్రూప్ సభ్యుల స్టేట్మెంట్...**

స్వరాజ్, వినాయక గ్రూప్ కు సంబంధించిన మొట్లగూడెం గ్రామస్థులు బ్యాంక్ అధికారికి లిఖితపూర్వకంగా స్టేట్మెంట్ ఇచ్చారు. స్వరాజ్, వినాయక గ్రూప్ లో గతంలో సభ్యులుగా ఉండి తీసుకున్న లోన్ పూర్తిగా చెల్లించామని మా ప్రమేయం లేకుండా గ్రామానికి సంబంధం లేని మరో ముగ్గురిని సభ్యులుగా చేర్చి అక్రమంగా బ్యాంకు నుంచి తీసుకున్న లోన్ కు మాకు ఎటువంటి సంబంధం లేదని తేల్చి చెప్పారు.

**అక్రమార్కుల పై చర్యలు తీసుకోవాలి..**

బ్యాంక్ నుంచి స్వరాజ్, వినాయక్ గ్రూపుల పేరుతో అక్రమంగా రుణాలు తీసుకుని బ్యాంకు సొమ్ము కాజేసిన బుక్ కీపర్, గ్రామదీపిక, సీసీ, ఏపీఎం, బ్యాంక్ మేనేజర్ పై చర్యలు తీసుకోవాలని మొట్లగూడెం గ్రామస్థులు, స్వయం సహాయక సంఘాల సభ్యులు డిమాండ్ చేశారు. చర్యలు తీసుకోవాలని లిఖిత పూర్వకంగా ఫిర్యాదును విచారణకు వచ్చిన బ్యాంకు ఉన్నతాధికారికి అందజేశారు.






**ఐకేపీ అధికారుల తీరు పై అనేక ప్రశ్నలు...**

గ్రామంలో లేని వ్యక్తుల పేర్లతో బ్యాంకు లింకేజీ రుణం అక్రమంగా తీసుకుని కాజేశారని బట్టబయలైనప్పటికీ ఐకేపీ అధికారులు చర్యలు తీసుకోకుండా ప్రేక్షకపాత్ర వహించడం పై అనేక ప్రశ్నలు తలెత్తుతున్నాయి. అక్రమార్కులకు కొందరి ఉన్నతాధికారుల అండదండలు పుష్కలంగా ఉన్నాయనే ఆరోపణలు ఉన్నాయి. బ్యాంకు లింకేజీ రుణం కోసం సీసీ, ఏపీఎం తప్పని సరి సంతకాలు చేయాలి. ఉత్తుత్తి గ్రూపులకు వీరు ఎలా సంతకాలు చేసి రుణాలు ఇప్పించారు అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. సుమారు 12 లక్షల రూపాయల బ్యాంకు సొమ్ము కాజేయడానికి పథకం వేసిన వీరందరి పై చీటింగ్ కేసు ఎందుకు నమోదు చేయించలేదో ఐకెపి అధికారులు సమాధానం చెప్పాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

# సింగరేణి మండలానికి రూ. 1.50 కోట్ల నిధులు

**ఎంపీ రఘురామ్ రెడ్డికి ఇమ్మడి కృతజ్ఞతలు**



**కారేపల్లి, మహా:** సింగరేణి మండలంలోని వివిధ గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి జాతీయ ఉపాధిహామీ పథకం నిధులు రూ.1.50 కోట్ల నిధులు మంజూరయ్యాయి. కారేపల్లి మండలానికి భారీగా నిధులు మంజూరు చేయించిన ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురామ్ రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు మంత్రి పొంగులేటి అనుచరుడు, కాంగ్రెస్ నాయకుడు ఇమ్మడి తిరుపతిరావు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మంత్రి పొంగులేటి నాయకత్వంలో ఎంపీ రఘురామ్ రెడ్డి కృషితో మరిన్ని నిధులు తీసుకువస్తామని తెలిపారు.

## కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన

# హామీని వెంటనే అమలు చేయాలి

- ఉద్యమకారుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు మామిడి పుల్లారావు
- సీనియర్ నాయకులు పొడియం నరేందర్



**బూర్గంపహాడ్ మహా :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, బూర్గంపహాడ్ మండలం లోని తెలంగాణ ఉద్యమకారులు అందరూ కలిసి ఉద్యమకారులకు ప్రభుత్వం ఇచ్చిన హామీని అమలు చేయాలని బూర్గంపహాడ్ తహసీల్దార్ గారికి బుధవారం వినతిపత్రం ఇవ్వటం జరిగినది. అనంతరం ఉద్యమనాయకులు పొడియం నరేందర్, మామిడి పుల్లారావు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉద్యమకారులకు ఇస్తానన్న 250 గజాల స్థలం, ఫెన్షన్, గుర్తింపు కార్డులు మరియు ప్రభుత్వ సంక్షేమ పథకాలను వెంటనే అమలు పరిచి ఉద్యమకారులకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో బూర్గంపహాడ్ మండలం లోని తెలంగాణ ఉద్యమకారులు పాల్గొన్నారు.

## కొమురం భీమ్ విగ్రహ ప్రతిష్టలో

# ఆదివాసీలు భాగస్వాములు కావాలి



**మహా దుమ్ముగూడెం :** ఆదివాసీల ఆరాధ్య దైవం పోరాట యోధుడు కొమరం భీమ్ విగ్రహాన్ని ములకపాడు జంక్షన్ లో ప్రతిష్టించడానికి ఆదివాసి సంఘాల ఐక్య కార్యచరణ వేదిక కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు జరుగుతున్నాయని ఈ విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో ఆదివాసీలంతా భాగస్వాములు కావాలని మూడు మండల ఆదివాసి సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ నాయకులు పిలుపునిచ్చారు. మండల కేంద్రం లక్ష్మీ నగరం సరియం. కోటేశ్వరరావు ఇంటి ఆవరణలో దుమ్ముగూడెం మండల ఆదివాసి ప్రజాసంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ సమావేశం నాయకులు సోయం కామరాజు, కొమరం దామోదర్ రావుల అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ దాతల సహకారంతో అమలాపురం కొమరం భీమ్ విగ్రహం ఏర్పాటుకు 90 శాతం పనులు పూర్తయ్యాయని ఇంకా పది శాతం పనులు పూర్తి కావలసి ఉందని దాతలు ఆదివాసీలు ఆదివాసి ఉద్యోగులు ప్రజాప్రతినిధులు తగిన సహకారాలు అందించి విగ్రహ ప్రతిష్ట లో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. మార్చి 9వ తేదీన దుమ్ముగూడెం మండల పరిషత్తు సమావేశ మందిరంలోజరిగే ఆదివాసి సర్పంచ్ ల ఉప సర్పంచు ల మహిళ సర్పంచుల సమావేశానికి ప్రతి ఒక్కరూ తరలిరావాలని పిలుపునిచ్చారు. గ్రామీణ ఉపాధి హామీ పథకం రూపాయలు కోటి 35 లక్షలు గోల్ మాల్ పై సమగ్ర విచారణ జరిపి దోషులపై చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ముర్రం వీరభద్రం, తునికి కామేష్, సర్పంచులు వాగే ఖాదర్ బాబు, కురుసం రవి, సరియం.రాజమ్మ,కొమరం. శాంతి, నాయకులు కొమరం చంటి, సరియం. చంటి, కనితి ముత్తయ్య, వట్టం నాగేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

# అంబురాన్నంటిన హోలీ సంబురాలు



**నేలకొండపల్లి, మహా:** మండలం లోని మంగాపురం గ్రామంలో బుధవారం హోలీ సంబురాలు తెజవత్ యూత్ వారి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. రిటైర్మెంట్ కండక్టర్ రమణ ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ అశోక రాణి పాల్గొన్నారు యువత ఆటా, పాటలతో సందడి చేశారు. రంగులు చల్లుకుంటూ కేరింతలో ఉత్సహం నడుమ వేడుకలు నిర్వహించారు. గ్రామాలలో యువత, మహిళలు, చిన్నారులు హోలీ వేడుకలు ఉత్సాభరితంగా నిర్వహించారు. యువత బైక్ విన్యాసాలు చేశారు. రంగులు చల్లుకుంటూ శుభాకాంక్షలు తెలిపారు.

# అయ్యప్ప స్వామి జన్మదిన వేడుకలు..

**కమలాపురం రామాలయంలో అన్నప్రసాద కార్యక్రమం..**



**మణుగూరు, మహా :** మణుగూరు మండలంలోని అయ్యప్ప స్వామి పీఠాల గురుస్వాములు, కమలాపురం అయ్యప్ప భక్తబృందం ఆధ్వర్యంలో అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడైన శ్రీ హరిహరపుత్రుడు అయ్యప్ప స్వామి జన్మ నక్షత్రమైన ఉత్తరా నక్షత్రం సందర్భంగా కమలాపురం గ్రామంలోని రామాలయంలో బుధవారం ఘనంగా అన్నప్రసాద కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అయ్యప్ప స్వామి విగ్రహానికి అర్చకులు గణపతి మంత్రోచ్చారణల మధ్య ప్రతిష్ఠ చేసి, పుష్పాభిషేకం నిర్వహించారు. అనంతరం పూలమాలలు వేసి అలంకారప్రియుడైన స్వామివారిని కన్నులపండువగా అలంకరించి విశేష పూజలు నిర్వహించారు. వడ్డించిన వంటకాలను స్వామివారికి నైవేద్యంగా సమర్పించి, తీర్థప్రసాదాలను భక్తులకు పంపిణీ చేశారు. మండలంలోని వివిధ అయ్యప్ప పీఠాల గురుస్వాముల సంకల్పబలం, భక్తుల సహకారంతో ప్రతి నెల ఉత్తరా నక్షత్రం రోజున మహా అన్నప్రసాద కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అయ్యప్ప మాలలు ధరించిన సమయంలో మాత్రమే కాకుండా ప్రతి నెల వచ్చే ఉత్తరా నక్షత్రాన్ని స్వామివారి జన్మదినంగా భావించి భక్తులు నిత్యం స్వామిని స్మరించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాలు కొనసాగిస్తున్నామని పేర్కొన్నారు. అన్నదాన కార్యక్రమంలో మండలంలోని అయ్యప్ప పీఠాల గురుస్వాములు, కమలాపురం అయ్యప్ప భక్త బృందం సభ్యులు, గ్రామ పెద్దలు, మహిళా భక్తులు, యువకులు పెద్దఎత్తున పాల్గొన్నారు. అయ్యప్ప స్వామి మహాప్రసాదం స్వీకరించిన భక్తులకు స్వామి వారి దీవెనలు మెండుగా ఉండాలని గురుస్వాములు ఆశీర్వదించారు.

## వీరు ప్రభుత్వ అధికారులు కాదు...

# వీరంతా విశాఖ ఇండస్ట్రీ ఉద్యోగులు

- నా సహచర మిత్రులపై అక్రమ కేసులు పెడుతున్నారు
- అదిలాబాద్ సబ్ జైల్ అధికారులు నన్ను దోమలు ఉన్న సెల్ లో పెట్టారు
- ఇక్కడ మీడియానే ప్రజాస్వామ్యాన్ని కాపాడాలి




**మందమర్రి, మహా :** మంచిర్యాల జిల్లాలో వివిధ శాఖలలో విధులు నిర్వహిస్తున్న వారు ప్రభుత్వ అధికారులు కాదు... వీరంతా విశాఖ ఇండస్ట్రీలో పని చేస్తున్న ఉద్యోగులని చెన్నూరు మాజీ ఎమ్మెల్యే, భారత రాష్ట్ర సమితి మంచిర్యాల జిల్లా అధ్యక్షులు బాల్క సుమన్ పోలీసులపై విరుచుకుపడ్డారు. బుధవారం అదిలాబాద్ సబ్ జైల్ నుండి విడుదలైన ఆయన తన నివాసంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్యాతనపల్లి మున్సిపాలిటీ ఎన్నికలలో ప్రజలు భారత రాష్ట్ర సమితికి 10, భారత కమ్యూనిస్టు పార్టీకి 4 కౌన్సిలర్ స్థానాలను గెలుచుకున్నారని వెల్లడించారు. ఇక్కడి మున్సిపాలిటీలో 22 సీట్లు ఉండగా అందులో 14 సీట్లు తాము తెలుసుకోగా 7 సీట్లను కాంగ్రెస్ పార్టీ గెలుచుకుందని చెప్పారు. ప్రజాస్వామ్యాన్ని గౌరవించి తమ 14 మంది కౌన్సిలర్లతో చైర్మన్ వైస్ చైర్మన్ లను ఎంపిక చేసుకోవలసి ఉండగా కాంగ్రెస్ పార్టీ కుట్రలు చేస్తుందని ఆరోపించారు. అందులో భాగంగా గత నెల 17న చెన్నూరు ఎమ్మెల్యే, రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేకానంద వాహనంపై రాళ్ల దాడి చేశామని అక్రమ కేసు పెట్టి నన్ను జైలుకు పంపారని ఆవేదన వ్యక్తం చేశారు. క్యాతనపల్లిలో నెలకొన్న పరిస్థితులపై మంచిర్యాల జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కి ఫిర్యాదు చేసిన ఆయన పట్టించుకోవడంలేదని అన్నారు. దీంతో రాష్ట్ర ఎన్నికల కమిషన్ కు ఫిర్యాదు చేసినట్లు స్పష్టం చేశారు. రామకృష్ణాపూర్ ఎస్సై తాను జైలులో ఉన్న సమయంలో తన ఇంటికి వచ్చి సోదాలు నిర్వహించినట్లు చెప్పారు. అంతేకాకుండా తన పార్టీ అనుచర బృందంపై లేనిపోని కేసులు బనాయించేందుకు ఉవ్విళ్లు ఊగుతున్నాడని ఆరోపించారు. ఫిబ్రవరి 17 నాడు క్యాతనపల్లి మున్సిపల్ కౌన్సిల్ కార్యాలయంలో లోపల ఉన్న వీడియో ఫుటేజ్ లను చూసి బయటకు విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. పోలీసులు తమ 14 మంది కౌన్సిలర్ల బంధువులు ఇండ్లలోకి వెళ్లి మాపై అక్రమ కేసులు పెట్టాలని చూస్తున్నారని పేర్కొన్నారు. అదిలాబాద్ సబ్ జైల్ అధికారులు నన్ను దోమలు ఉన్న సెల్ లో పెట్టారని వాపోయారు. జైలులో తనకు గొంతు నొప్పి ఉందని మందులు కావాలి అని అడిగితే ఇవ్వని పరిస్థితి దాపురించిందని వెల్లడించారు. ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి డైరెక్షన్ మేరకు మంత్రి వివేక్, పోలీసులు కలిసి జైల్లో పెట్టి ఇబ్బందులకు గురి చేశారని పేర్కొన్నారు.సోమవారం మంచిర్యాల, హైదరాబాద్ కోర్టులలో బెయిల్ వచ్చినప్పటికీ బలవంతంగా ప్రభుత్వ పెద్దలు ఒత్తిడి చేసి చెన్నూరు కోర్టులో బెయిల్ రాకుండా చూశారని అన్నారు. నన్ను మా నాయకులను ఇబ్బందులకు గురి చేసినందుకు మంత్రి వివేక్ కు ఐ లవ్ యు అని చమత్కరించారు. క్యాతనపల్లి ప్రజలు ఇచ్చిన తీర్పును గౌరవించి చైర్మన్ వైస్ చైర్మన్ ఎన్నికను సజావుగా జరిపించాలి. నాయకులను రాజకీయ ప్రత్యర్థులుగా భావించామే కానీ వ్యక్తిగత కక్ష సాధింపులకు బీఆర్ఎస్ ప్రభుత్వం ఎప్పుడూ ప్రోత్సహించలేదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్, సీపీఐ పార్టీలకు చెందిన నేతలు పాల్గొన్నారు.




## తులసీరామ్ కుటుంబానికి అండగా

# నిలిచిన పోస్టల్ శాఖ

**రెండు లక్షల భీమా చెక్కు అందజేత**

**కారేపల్లి, మహా:** సింగరేణి మండల పరిధిలోని బోటితండా గ్రామపంచాయతీ సర్పంచ్ భూక్య తులసీరామ్ ఇటీవల అనారోగ్యంతో మరణించారు.గతంలో పోస్ట్ ఆఫీస్ ద్వారా తన పేరు మీద పీఎంజేజేబివై ఇన్సూరెన్స్ పాలసీ తీసుకోవడం జరిగింది.ఈ పాలసీ ద్వారా వచ్చిన భీమా మొత్తం 2 లక్షల రూపాయల సంబంధించిన చెక్కును బోటి తండా సర్పంచ్ బాదావత్ మంగీలాల్,జిల్లా పోస్టల్ సూపర్డెంట్ వీరభద్ర స్వామి చేతుల మీదుగా బుధవారం తులసీరామ్ సతీమణి విజయలక్ష్మికు చెక్కును అందజేశారు.ఈ కార్యక్రమంలో ఐపీఓ,ఎంఓలు,ఐపిపిబి మేనేజర్లు,బ్రాంచ్ పోస్ట్ మాస్టర్ సాయి,పోస్టల్ సిబ్బంది బి రామకృష్ణ,జి శరణ్,జె విజయ్ , యశ్వంత్,జవహర్,నవీన్, ప్రత్యూష ,రమ్య,గ్రామస్తులు పాల్గొన్నారు

# మందమర్రిలో గుబాలిస్తున్న గుడుంబా

**చూసి చూడనట్లుగా ఎక్సైజ్ శాఖ, స్థానిక పోలీసులు**

**మందమర్రి, మహా :** మందమర్రి పట్టణంలో గుబాలిస్తున్న గుడుంబా. అతి తక్కువ ధరకు విక్రయిస్తున్న గుడుంబాను ప్రజలు సేవించడం మూలంగా కొంతమంది అనారోగ్యం పాలవుతుంటే మరి కొంతమంది ప్రాణాలను కోల్పోతున్నారు. ఈ గుడుంబా నిర్మూలన కొరకు ఎక్సైజ్ శాఖ అధికారులకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక అధికారాలు ఇచ్చినప్పటికీ ఆ శాఖ పట్టిక బెల్లం, విక్రయిస్తున్న వారిని చూసి చూడనట్టుగా వ్యవహరిస్తున్నట్లు ప్రజలు ఆరోపిస్తున్నారు. అత్యాశతో కొంతమంది వివిధ రాజకీయ పార్టీలకు చెందిన నాయకులతో చేతులు కలిపి మందమర్రి పట్టణ చుట్టుపక్కల అటవీ ప్రాంతాలలో గుడుంబా స్థావరాలను ఏర్పాటు చేసుకున్నట్లు తెలుస్తోంది. ఇలా గుడుంబా విక్రయదారులకు సహకరించినందుకుగాను కొంతమంది నాయకులకు నెలవారీగా నజరాణాలు ముట్టుతున్నాయని విమర్శలు వెలివెత్తుతున్నాయి. ఇక్కడ తయారైన గుడుంబాను ప్యాకెట్ల ద్వారా పట్టణంలో వివిధ విక్రయ దారుణకు అమ్మకాలు జరుపుతున్నట్లు సమాచారం. ఒక ప్యాకెట్ కు 30 రూపాయల చొప్పున పట్టణంలో విక్రయాలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. గుడుంబా తయారీదారులు రెండు రోజులకు ఒకసారి పట్టణంలోని వివిధ కాలనీ నివాసాలలో అమ్మకాలు జరుపుతున్న వారికి గుడుంబా ప్యాకెట్లు సరఫరా చేస్తున్నట్లు తెలుస్తోంది. పలు ప్రాంతాలలో గుడుంబా విషయాలు జరుగుతున్నాయని ఎక్సైజ్, స్థానిక పోలీసులకు కొంతమంది కాలనీవాసులు సమాచారం ఇస్తే పట్టించుకోవడంలేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. మందమర్రి పట్టణం దొరల బంగ్లాల ఏరియా, ఊరు రామకృష్ణాపూర్ రోడ్డు, పాల చెట్టు, రెండవ జోన్, కూరగాయల మార్కెట్ చుట్టుపక్కల ప్రాంతాలు, రైల్వే స్టేషన్ రోడ్డు, అంగడి బజార్, ఊరు మందమర్రి, విద్యానగర్, యాపల్ తదితరులలో గుడుంబా విక్రయాలు జరుగుతున్నట్లు సమాచారం. ఇప్పటికైనా సంబంధిత శాఖల అధికారులు పట్టణ కాలనీలలో వెలసిన షాపులను గుర్తించి విక్రయాలు జరుపుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



## సత్తుపల్లి ఏరియా ఆసుపత్రిలో

# వైద్యుల కొరత పరిష్కరించండి

**డి.వై.సీ.ఎం.ఓ నరసింహారావుకు వైస్ ప్రెసిడెంట్ బి.కోటేశ్వరరావు వినతి**

**సత్తుపల్లి, మహా:** సింగరేణి సత్తుపల్లి ఏరియా వైద్యశాలలో డాక్టర్ల కొరత పరిష్కరించాలని సెక్రెటరీ జనరల్ మినిమం వేజెస్ చైర్మన్ జనక్ ప్రసాద్ సూచన మేరకు డిస్పెన్సరీ డి.వై.సి.ఎం.ఓ డాక్టర్ నరసింహారావుకు సత్తుపల్లి ఏరియా ఐ.ఎన్.టి.యు.సి వైస్ ప్రెసిడెంట్ బి .కోటేశ్వరరావు వినతి పత్రం అందజేశారు. జలగం వెంగళరావు, కిష్టారం ఓ.సీ లలో కుటుంబాలతో కలిసి 4000 మంది సింగరేణి కార్మికులు ఉన్నారని, అనారోగ్య పరిస్థితులలో కార్మికుల కుటుంబ సభ్యులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని కోటేశ్వరరావు అన్నారు. డిస్పెన్సరీలో ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్న మహిళా డాక్టర్ వ్యక్తిగత కారణాలతో ఉద్యోగానికి రాజీనామా చేసి వెళ్ళారని, మహిళల వైద్య పరీక్షలు నిర్వహించడానికి మహిళ డాక్టర్ కొరత ఉన్నదని దానిని తక్షణమే పరిష్కరించాలని కోరారు. స్పందించిన డి.వై.సీ.ఎం.ఓ డాక్టర్ నరసింహారావు సమస్యను జెంటిల్ మేనేజర్ చింతల శ్రీనివాస్ దృష్టికి తీసుకువెళ్లి తక్షణ పరిష్కారానికి సహకరిస్తానని తెలిపారు.

# టీ కొత్తగూడెం లిఫ్ట్ ఇరిగేషన్ పథకంకు నిధులు మంజూరు



**పినపాక, మహా:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పినపాక మండలంలోని టీ.కొత్తగూడెం గ్రామంలో అనేక ఏళ్లుగా మూలన పడ్డ ఎత్తిపోతల పథకాని ప్రజా ప్రభుత్వంలో పునరుద్ధరణకు అడుగులు పడ్డాయి. ఆదివాసి నవనిర్మాణ సేన రాష్ట్ర అధ్యక్షులు కొర్స నరసింహమూర్తి, పినపాక నియోజకవర్గం శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు చొరవతో వ్యవసాయం,రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ ఎం.కోదండరెడ్డి సహకారంతో కోటి 30 లక్షల రూపాయల నిధులు మంజూరు చేశారు. టి.కొత్తగూడెం లిఫ్ట్ ఇరిగేషన్ రిపేర్లకు కోటి 30 లక్షల రూపాయల నిధులు మంజూరుకి కృషిచేసిన ఆదివాసీ నవనిర్మాణ సేన రాష్ట్ర అధ్యక్షులు కొర్స నరసింహమూర్తి కి, ఎమ్మెల్యేపాయం వెంకటేశ్వర్లు కి,రైతు సంక్షేమ శాఖ చైర్మన్ కోదండ రెడ్డి కి లిఫ్ట్ ఇరిగేషన్ పరిధిలోని ఆయకట్టు రైతులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఇంకొంత నిధులు అధికంగా వెచ్చిస్తే టీ కొత్తగూడెం లిఫ్ట్ ఇరిగేషన్ పథకం సంపూర్ణంగా వినియోగంలోకి వచ్చి రైతులకు మరింత మేలు జరుగుతుందని ఆయకట్టు పరిధిలోని రైతులు ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ని,కొర్స నరసింహమూర్తి ని, రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి ని కోరారు. వీరు చొరవ చూపితే టీ కొత్తగూడెం లిఫ్ట్ ఇరిగేషన్ పథకం పూర్తిస్థాయిలో వినియోగంలోకి వచ్చి రైతుల జీవితాల్లో వెలుగులు నిండుతాయని రైతాంగం ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

## సొంత నిధులతో రోడ్డు బాగుచేసిన దాత..

# కాలనీవాసుల హర్షం!

**ఆమనగల్లు, మహా :** ఆమనగల్లు మున్సిపాలిటీ 5వ వార్డులో వర్షాకాలం కారణంగా బురదమయంగా మారిన రోడ్డును స్థానిక దాత ఒగ్గు మహేశ్ తన సొంత ఖర్చులతో బుధవారం చదును చేయించారు. కాలనీలో నీరు నిలిచి ప్రజలు పడుతున్న ఇబ్బందులను గమనించిన ఆయన, మట్టిని పోయించి సమస్యను పరిష్కరించారు. దీంతో దీర్ఘకాలిక సమస్య తీరడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# కారేపల్లిలో హోలీ సందడి



**కారేపల్లి, మహా :** కారేపల్లి మండలంలో గ్రామాల్లో హోలీ వేడుకలు సందడిగా సాగాయి. ప్రభుత్వం హోలీ సెలవు దినం మంగళవారం ప్రకటించినా ఆ రోజు చంద్రగ్రహణం కావటంతో పండుగ జరపలేదు. మండలంలోని గ్రామాల్లో బుధవారం హోలీ జరుపుకున్నారు. తండాల లో హోలీ వేడుకలతో సందడి గా మారాయి. కారేపల్లిలో బీసీ కాలనీ యువకులు కారేపల్లి డప్పు వాయిద్యాలతో రంగులు చల్లుకుంటూ ఊరేగింపుగా హోలీ వేడుకను జరిపారు. యువకులు తమ సవాసగాళ్లను ఆటపట్టిస్తూ తలపై కోడి గ్రుడ్లు కొడుతూ, నల్లని తారు అయిల్ పూస్తూ అనందంతో నృత్యాలు చేశారు. వయసు, ఆడమగ, తారతమ్య బేధాలు పక్కన పెట్టి హోలీ జరుపుకున్నారు.

## రిటైర్డ్ ఉద్యోగుల పెన్షన్ బెనిఫిట్స్

# వెంటనే చెల్లించాలి

**దొడ్డి తాతారావు**
**బిఆర్ఎస్ పార్టీ మండల కన్వీనర్**



**చర్ల మహా:** రిటైర్డ్ ఉద్యోగుల పెన్షన్ బెనిఫిట్స్ వెంటనే ఇవ్వాలి బిఆర్ఎస్ కన్వీనర్ దొడ్డి తాతారావురాష్ట్రంలో రిటైర్డ్ అయిన ఉద్యోగులకు పెన్షన్ బెనిఫిట్స్ వెంటనే ఇవ్వాలని బిఆర్ఎస్ పార్టీ కన్వీనర్ దొడ్డి తాతారావు రిటైర్డ్ ఉద్యోగుల సంఘాల నాయకులు డిమాండ్ చేశారుఈరోజు బిఆర్ యస్ పార్టీ కన్వీనర్ దొడ్డి తాతారావు ఆధ్వర్యంలో రిటైర్డ్ ఉద్యోగ సంఘ నాయకులతో కలిసి తాసీల్దార్ ఆఫీసు వద్ద ప్రభుత్వాని నిరసన తెలియజేసి అనంతరం తహసీల్దార్ శ్రీనివాస రావు గారికి సమస్యలపై వినతిపత్రం అందజేయడం జరిగింది తాసీల్దార్ గారు మీ సమస్యల వినతిపత్రం కలెక్టర్ గారికి పంపిస్తాను అని తెలియజేసారు ఈ సందర్భంగా బిఆర్ఎస్ పార్టీ కన్వీనర్ దొడ్డి తాతారావు మాట్లాడుతూ రాష్ట్రంలో వేలమంది రిటైర్డ్ ఉద్యోగులు పెన్షన్ బెనిఫిట్స్ రాక అనేక ఇబ్బందులు పడుతున్నారు 30 సంవత్సరాలు ప్రభుత్వ ఉద్యోగంలో ప్రజా సేవ చేసి వచ్చిన జీవితంతో కుటుంబాని నడుపుకుంటుకొంత ప్రభుత్వాం దగ్గర దాచ్చుకుంటు న్యాయం పరంగా ప్రభుత్వాం ద్వారా వచ్చే బెనిఫిట్స్ కోసం ఆశగా ఎదురు చూస్తారు కానీ వారి ఆశ నిరాశ అయింది పెన్షన్ బెనిఫిట్స్ రాక రాష్ట్రం మానసిక ఒత్తిడికి గుండె పోటు తో మరియు ఆత్మహత్యలు చేసుకున్నారు ఇప్పుడి 72 మంది చనిపోయారు ఎలక్షన్ లో కాంగ్రెస్ ప్రభుత్వం పిఆర్సి ఇస్తాము డిఏ లు ఇస్తామని మాయ మాటలకు ఉద్యోగులు కాంగ్రెస్ పార్టీని గెలిపించారు గెలిచిన తర్వాత హమీలు మర్చిపోయరు ఇప్పుటికైన రిటైర్డ్ ఉద్యోగుల పెన్షన్ బెనిఫిట్స్ వెంటనే ఇవ్వాలని వారి చావుల మరణమృదంగాని ఆపాలని తెలియజేసారు ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఉద్యోగ సంఘ నాయకులు డి సర్వేశ్వరరావు పి నరసింహారావు BVSL నరసింహారావు V నాగభూషణం ఆడెపు ముత్యాలరావు A నాగేశ్వరావు G S రాజకుమార్ బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు అజీజ్ కాకి అనిల్ పంజా రాజు గోరింట్ల వెంకటేశ్వరావు యూత్ నాయకులు బొజ్జ సాయిప్రణీత్ గాధం శెట్టి కిషోర్ కుమార్ పాసిగంటి సంతోష్ ch వంశీ మహిళ నాయకురాలు బేతం చర్ల నర్సవేణి అంకాల శ్రీనివాసరావు అనేకమంది రిటైర్డ్ ఉద్యోగులు పాల్గొన్నారు

## జాతీయ పోలీస్ కబడ్డీ సమరానికి

# నల్లగొండ నారి..

- తెలంగాణ కబడ్డీ జట్టు కెప్టెన్‌గా షైక్ నౌషీన్ ఎంపిక..
- జమ్మూకాశ్మీర్‌లో జరగనున్న ఆల్ ఇండియా పోలీస్ మీట్‌కు సిద్ధం..
- అభినందించిన జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్



**నల్లగొండ మహా :** పోలీసు విధుల్లోనే కాదు.. క్రీడా మైదానంలోనూ తాను 'సై' అంటూ నల్లగొండ జిల్లాకు చెందిన మహిళా పోలీస్ అధికారి షైక్ నౌషీన్ జాతీయ వేదికపై సత్తా చాటేందుకు సిద్ధమయ్యారు. జిల్లా కేంద్రంలోని IIటౌన్ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న ఆమె ఈ నెల 7 నుంచి 13 వరకు జమ్మూకాశ్మీర్‌లో నిర్వహించనున్న 'ఆల్ ఇండియా పోలీస్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్ 2026'కు ఎంపికయ్యారు. ఈ ప్రతిష్టాత్మక టోర్నీలో తెలంగాణ రాష్ట్ర పోలీస్ కబడ్డీ జట్టుకు ఆమె కెప్టెన్‌గా వ్యవహరించనున్నారు.ఇటీవల గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో జరిగిన 4వ తెలంగాణ పోలీస్ స్పోర్ట్స్ మీట్‌లో యాదాద్రి V జోన్ తరపున ఆడిన నౌషీన్ తన అద్భుత ప్రదర్శనతో జట్టుకు బంగారు పతకాన్ని అందించారు. గతంలో జరిగిన 3వ స్టేట్ మీట్‌లోనూ రజత పతకం సాధించి రెండు సందర్భాల్లోనూ కెప్టెన్‌గా జట్టును ముందుండి నడిపించారు.నౌషీన్ క్రీడా ప్రస్థానంలో ఎన్నో మైలురాళ్లు ఉన్నాయి..ఇప్పటివరకు 20 సార్లు జాతీయ స్థాయి కబడ్డీ పోటీల్లో,3 సార్లు ప్రతిష్టాత్మకమైన 'ఇండియన్ క్యాంప్స్'లో పాల్గొని శిక్షణ పొందారు.2025లో పంజాబ్‌లోని జలంధర్‌లో జరిగిన ఆల్ ఇండియా మీట్ లోనూ తెలంగాణ జట్టుకు సారథ్యం వహించారు.

**జిల్లా ఎస్పీ ప్రశంసలు...**

నౌషీన్ సాధించిన ఈ ఘనతపై జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్, ఐపీఎస్ హర్షం వ్యక్తం చేశారు. బుధవారం ఆమెను ప్రత్యేకంగా అభినందించిన ఎస్పీ జమ్మూకాశ్మీర్ వేదికగా జరగనున్న పోటీల్లో రాష్ట్ర కీర్తి పతాకాన్ని ఎగురవేయాలని ఆకాంక్షించారు. విధి నిర్వహణతో పాటు క్రీడల్లో రాణించడం ఇతర పోలీస్ సిబ్బందికి స్ఫూర్తిదాయకమని కొనియాడారు.

# పనికి తగిన ప్రతిఫలం దక్కాలి

**సింగరేణి వీవోఏ ల నూతన సంఘం ఏర్పాటు**



**కారేపల్లి, మహా :** గ్రామాలలో సంఘాల బలోపేతం, మహిళల అర్థికాభివఅద్ధికి కృషి చేస్తున్న గ్రామ సమాఖ్య సహాయకుల (వీవోఏ )కు పనికి తగిన ప్రతిఫలం దక్కటం లేదని వీవోఏల సంఘం మండల అధ్యక్షకార్యదర్శులు బొడ్డుపల్లి వసంత, ఈసం నాగమణిలు ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం కారేపల్లిలో సింగరేణి మండల వీవోఏ లు కొత్తగా సంఘాన్ని ఏర్పాటు చేసుకున్నారు. ఈసందర్భంగా జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ సంఘం ద్వారా వీవోఏ ల సమస్యలు పరిష్కారంకు కృషి చేయటంతో పాటు సెర్ప్ ప్రాజెక్టు ద్వారా ఇచ్చే ఆదేశాలను వెంటనే అమలు చేయటానికి కృషి చేస్తామన్నారు. వీఏవోలకు ప్రభుత్వమే పూర్తి వేతనాలు చెల్లించాలని కోరారు. అనంతరం నూతన కమిటీ ని ఎన్నుకున్నారు. సంఘం అధ్యక్షురాలి గా బోడ్డుపల్లి వసంత, కార్యదర్శిగా ఈసం నాగమణి, కోశాధికారిగా చీకూర్తి సుజాతలను ఎన్నకున్నారు. అనంతరం సంఘ బాధ్యులు సింగరేణి మండల ఐకేపీ ఏపీఎం పిడమర్తి వెంకటేశ్వర్లు కు వినతి ప్రతం అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకురాళ్లు పీ.మమత, బీ.సింధుజ, వై.కళ్యాణి, పి.రమాదేవి, జీ.మోహన్, టీ.లలిత, కే.వెంకటేశ్వర్లు, కే.మంగతాయి, ఎన్.అనూష, సీహెచ్. లక్ష్మి. పీ.బాలక□ష్ణ తదితరులు పాల్గొన్నారు.

ANN తెలుగు

మహా పత్రిక

గురువారం, హైదరాబాద్

05-03-2026









# విరోష్ వెడ్డింగ్ రిసెప్షన్

## తారల తళుకులు.. రాజకీయ ప్రముఖుల మెరుపులు

**హైదరాబాద్, మహా :** టాలీవుడ్ సెన్సేషనల్ కపుల్ విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న వివాహ రిసెప్షన్ వేడుక బుధవారం రాత్రి హైదరాబాద్‌లోని ప్రఖ్యాత తాజ్ కృష్ణ హోటల్‌లో గ్రాండ్‌గా జరిగింది. ఈ వేడుకలో నూతన దంపతులు విజయ్, రష్మిక ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. తెలుగు సంప్రదాయబద్ధంగా సాగిన ఈ వేడుకలో రష్మిక ఎరుపు రంగు పట్టు చీరలో మెరిసిపోగా, విజయ్ వైట్ వెష్టి (పంచె), కుర్తాలో ఎంతో హుందాగా కనిపించారు. అతిథులందరికీ విరోష్ టీమ్ సాదరంగా స్వాగతం పలికింది. ఈ వేడుకకు టాలీవుడ్ నుంచి బాలీవుడ్ వరకు సినీ ప్రముఖులు, రాజకీయ నేతలు పెద్ద ఎత్తున హాజరయ్యారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీలో ఉండడంతో ఆయన సతీమణి గీతారెడ్డి హాజరై వధువరులను ఆశీర్వదించారు. కర్నాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ నూతన దంపతులను ఆశీర్వదించారు. మెగాస్టార్ చిరంజీవి, అక్కినేని నాగార్జున దంపతులు, దగ్గుబాటి వెంకటేశ్, రామ్ చరణ్ దంపతులు, అల్లు అర్జున్, నాగచైతన్య, నాని, నవీన్ పొలిశెట్టి, శరత్ కుమార్‌రాధిక దంపతులు, నమ్రతా శిరోద్కర్ తన కుమార్తె సితారతో కలిసి హాజరయ్యారు. నిర్మాత అశ్వనీదత్, దర్శకుడు సందీప్ రెడ్డి వంగా తదితరులు నూతన వధూవరులను ఆశీర్వదించారు. తెలంగాణ గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ దంపతులు, మాజీ మంత్రి మల్లారెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్ , ఎమ్మెల్యే పల్లా రాజేశ్వరరెడ్డి దంపతులు, ఎంపీ మల్లురవి వంటి ప్రముఖులు హాజరై సందడి చేశారు.























## విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

- పరీక్షా సామాగ్రి,డిక్షనరీల పంపిణీ..
- కె.ఎల్. ఫౌండేషన్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమం..



**నల్లగొండ టౌన్ మహా :**విద్యార్థులు క్రమశిక్షణతో చదివి భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరుకోవాలని కె.ఎల్. ఫౌండేషన్ ప్రతినిధి కొత్త భాను చందర్ యాదవ్ ఆకాంక్షించారు. బుధవారం నల్లగొండ పట్టణం 9వ డివిజన్ గంధంవారిగూడెంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 100 మంది విద్యార్థుల కు పరీక్షా సామాగ్రిని పంపిణీ చేశారు. స్థానిక కార్పొ రేటర్ బానోతు ధీప్లా నాయక్‌తో కలిసి ఆయన ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా భాను చందర్ యాదవ్ మాట్లాడుతూ.. పరీక్షల సమయంలో విద్యార్థులకు అవసరమైన రైటింగ్ ప్యాడ్లు, పెన్నులతో పాటు ఆంగ్ల భాషపై పట్టు సాధించేందుకు డిక్షనరీల ను అందజేస్తున్నట్లు తెలిపారు. ఇటువంటి చిన్నపాటి సాయం విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని నింపుతుందని వారు ఒత్తిడి లేకుండా పరీక్షలు రాసేందుకు దోహ దపడుతుందని పేర్కొన్నారు. సామాజిక బాధ్యతగా విద్యార్థులకు అండగా నిలవడం సంతోషంగా ఉం దన్నారు.ఈ సేవా కార్యక్రమంలో పాఠశాల ప్రధానో పాధ్యాయురాలు గీత మేడం, ఉపాధ్యాయ బృందం, వజ్జే శ్రీనివాస్ యాదవ్, చిన్నాల ఆంజనేయులు, మాధవ రెడ్డి, ముత్తిరెడ్డి, జల్లాల జానయ్య, మంటిపెల్లి లింగయ్య, కందుల శ్రీనివాస్ పాల్గొన్నారు.

# కాంగ్రెస్ 'సామాజిక న్యాయం' మాదిగలకు ఎక్కడ?

- మిగిలిన 2 రాజ్యసభ స్థానాల్లో ఒకటి మాదిగలకు ఇవ్వాలి బకరం శ్రీనివాస్..
- నల్గొండలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఆందోళన..



**నల్గొండ మహా :** తెలంగాణ రాష్ట్రంలో అత్యధిక జనాభా కలిగిన మాదిగ సామాజిక వర్గానికి కాంగ్రెస్ ప్రభుత్వం రాజకీయంగా తీవ్ర అన్యాయం చేస్తోందని తక్షణమే భర్తీ చేయబోయే రాజ్యసభ స్థానాల్లో ఒకటి మాదిగల కు కేటాయించాలని ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ శ్రేణులు డిమాండ్ చేశాయి. ఈ మేరకు బుధవారం నల్గొండలో మంత్రి క్యాంప్ కార్యాలయాన్ని ముట్టడించి నిరసన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత మాదిగ సామాజిక వర్గానికి దక్కాల్సిన ప్రాతినిధ్యం పూర్తిగా కనుమరుగైందని ఆవేదన వ్యక్తం చేశారు.

**చట్టసభల్లో చోటు కరువు..**

ముట్టడి అనంతరం ఎంఎస్పీ నల్గొండ జిల్లా అధ్య క్షుడు బకరం శ్రీనివాస్ మాదిగ, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బోడ సునీల్ మాదిగ మాట్లాడుతూ.. రాష్ట్ర జనాభాలో సగానికి పైగా ఉన్న ఎస్సీలలో అత్యధిక సంఖ్యలో ఉన్న మాదిగ సామాజిక వర్గాని కి లోక్ సభతో పాటు శాసనమండలి ఎన్నికల్లోనూ కాంగ్రెస్ తీవ్ర అన్యాయం చేసిందని ధ్వజమెత్తా రు. "గత లోక్ సభ ఎన్నికల్లో మాకు ఒక్క టికెట్ కూడా ఇవ్వలేదు. ఇటీవల జరిగిన 5 శాసనమం డలి స్థానాల భర్తీలోనూ మాకు మొండి చేయి చూపించారు. రేవంత్ రెడ్డి పాలనలో మాదిగలకు చట్టసభల్లో ప్రాతినిధ్యం లేకుండా పోతోంది" అని వారు ఆరోపించారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీరును దివంగత ముఖ్యమంత్రులు వైఎస్ రా జశేఖర్ రెడ్డి, చంద్రబాబు నాయుడులతో పోల్చి నాయకులు తీవ్ర విమర్శలు చేశారు. "గతంలో వైఎస్సార్ హయాంలో లోక్ సభలో మంద జగన్నా థం, సిరిసిల్ల రాజయ్య.. రాజ్యసభలో నంది ఎల్లయ్య వంటి మాదిగ నేతలు ఒకేసారి చట్టసభల్లో ప్రాతిని ధ్యం వహించారు. చంద్రబాబు హయాంలో కూడా ఇద్దరు మాదిగ ఎంపీలతో పాటు, రాజ్యసభలో ఆకారపు సుదర్శన్‌కు అవకాశం దక్కింది. అంటే అప్పట్లో మాదిగ సామాజిక వర్గానికి సరైన గుర్తింపు ప్రాతినిధ్యం ఉండేవి. కానీ రేవంత్ రెడ్డి కాలంలో మాదిగలు పూర్తిగా రాజకీయంగా వెనుకబడిపో యారు. మాదిగ బిడ్డే ముఖ్యమంత్రి అని చెప్పుకు న్నప్పటికీ.. ఆచరణలో మాదిగ జాతిపై సవతి ప్రేమ చూపుతున్నారు అని నాయకులు దుయ్యబట్టారు.

**సామాజికన్యాయం పాటించాలి..అధిష్టానాన్ని ఒప్పించాలి**

ప్రస్తుతం తెలంగాణ నుంచి పార్లమెంట్‌లో రెడ్డి, బీసీ, ఎస్టీ, అలాగే ఎస్సీలలోని మాల సామాజిక వర్గానికి ప్రాతినిధ్యం ఉందని.. కేవలం మాదిగలే విస్మరణకు గురయ్యారని నాయకులు స్పష్టం చేశారు. ఇప్పటి కే రాజ్యసభలో రెడ్లకు ప్రాతినిధ్యం ఉంది. కాబట్టి సామాజిక న్యాయం పాటించి మిగిలిన 2 రాజ్యసభ స్థానాల్లో ఒకటి అసలే ప్రాతినిధ్యం లేని మాదిగలకు కేటాయించాలి. అధిష్టానాన్ని ఒప్పించి మాదిగలకు రాజ్యసభ సీటు వచ్చేలా చూడాల్సిన పూర్తి బాధ్యత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మీదనే ఉందని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో మంద కృష్ణ మాదిగ పిలుపు మేరకు రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలు ఉధృతం చేస్తామ ని హెచ్చరించారు.ఈ ముట్టడి కార్యక్రమంలో ఎంఎస్పీ నియోజకవర్గ ఇన్చార్జి యం. దేవయ్య మాదిగ, ఎమ్మా ర్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు మాచర్ల సుదర్శన్ మాదిగ, జిల్లా కార్యదర్శి తరి ఏడుకొండలు, పట్టణ అధ్యక్షులు మాసారం వెంకన్న మాదిగ, ఎంఎస్పీ జిల్లా ప్రధాన కా ర్యదర్శి బొజ్జ చిన్న మాదిగ, కందుల మోహన్ మాదిగ, వంగూరి ప్రసాద్, ఏర్పుల శ్రవణ్ కుమార్, రాజు, బొజ్జ నరసింహ, లింగస్వామి తదితర ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## 6 నుంచి ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక..

- ఉమ్మడి జిల్లా సన్నాహక సమావేశానికి సర్వం సిద్ధం..
- హాజరుకానున్న మంత్రులు, ప్రజాప్రతినిధులు..
- 99 రోజుల పాటు క్షేత్రస్థాయిలో కార్యక్రమాలు..
- నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు కలెక్టర్ బి. చంద్రశేఖర్..



**నల్గొండ టౌన్ మహా :** రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో 'ప్రజాపాలనప్రగతి ప్రణాళిక'ను పకడ్బందీగా నిర్వహించేందుకు యంత్రాంగం సిద్ధమైంది. ఈ నెల 6 నుంచి జూన్ 12 వరకు సుమారు 99 రోజుల పాటు ఈ కార్యక్రమాలు కొనసాగనున్నాయి. దీనిపై అవగా హన కల్పించేందుకు ఈనెల 6న నల్గొండలో ఉమ్మడి జిల్లా స్థాయి సన్నాహక సమావేశాన్ని నిర్వహించను న్నట్లు జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ వెల్లడించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అధికా రులతో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి నేతృత్వంలో జరిగిన కలె క్టర్ల సదస్సులో అందిన మార్గదర్శకాల ప్రకారం ప్రతి అధికారి వారంలో కనీసం నాలుగు రోజుల పాటు క్షే త్రస్థాయిలో ఉండి పనులను పర్యవేక్షించాలని కలెక్టర్ ఆదేశించారు. గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు ప్రజాప్రతినిధులను ఈ ప్రణాళికలో భాగస్వాములను చేయాలని స్పష్టం చేశారు. ఈ 99 రోజుల ప్రణాళిక లో భాగంగా ప్రభుత్వం నిర్దేశించిన పలు సామాజిక అభివృద్ధి కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి సారించనున్నా ప్రధాన అంశాలు.. పారిశుద్ధ్యం & ఫైల్స్ క్లియరెన్స్.. మార్చి 6న అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో శానిటేషన్ పనులు చేపట్టడంతో పాటు, పెండింగ్‌లో ఉన్న ఫైళ్లను వెంటనే పరిష్కరించాలి.ఆరోగ్యం & విద్య పై పిల్లలకు హెచ్‌పీవీ వ్యాక్సినేషన్, నాణ్యమైన విద్య అందించ డంపై దృష్టి పెట్టాలి. యువజన వారోత్సవాలు, జాబ్ మేళాల నిర్వహణ, డ్రగ్స్ నివారణపై అవగాహన కల్పించాలి. వ్యవసాయానికి సంబంధించి రైతులకు అందుతున్న పథకాలు, సంక్షేమ ఫలాలను గ్రామసభ ల్లో లబ్ధిదారులతో చర్చించాలి.

**అన్ని శాఖల సమన్వయం అవసరం**

పర్యావరణ పరిరక్షణలో భాగంగా నర్సరీల నిర్వహణ, సోలార్ విద్యుత్ వాడకంపై ప్రజల్లో చైతన్యం తేవాలని కలెక్టర్ కోరారు. 'అరైవ్ అండ్ అలైవ్' వంటి రహదారి భద్రతా కార్యక్రమాలను మండల స్థాయిలో నిర్వహించా లని సూచించారు. అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనల్లో స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొనేలా చూడాలన్నారు. ఈ సందర్భంగా వివిధ శాఖలు నిర్వ హించాల్సిన పనులపై కలెక్టర్ పవర్ పాయింట్ ప్రజెంటే షన్ ద్వారా అధికారులకు వివరించారు.ఈ సమావేశం లో రెవిన్యూ అదనపు కలెక్టర్ జే. శ్రీనివాస్, మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ అమిత్, స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ వై. అశోక్ రెడ్డి, వివిధ విభాగాల ఆర్డీవో లు, జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

## జాతీయ అభివృద్ధికి పరిశోధనలు కీలకం..

**చైతన్య డీమ్డ్ టూబీ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ జీ.శంకర్ లింగం**



**మొయినాబాద్ మహా:** పరిశోధనలు సమాజానికి ది క్సూచిలాగా ఉపయోగపడాలని చైతన్య డీమ్డ్ టూబీ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ జీ.శంకర్ లింగం పేర్కొన్నారు. మొయినాబాద్ మున్సిపల్ పరిధిలోని హిమాయత్ నగర్ లో గల చైతన్య డీమ్డ్ టూబీ యూ నివర్సిటీలో ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరిం గ్ విభాగంలో "ఏ నావెల్ అడాప్టివ్ కంట్రోల్ మెథడ్ ఫర్ ఎ సింగిల్ పేజ్ సింగిల్ స్టేజ్ మల్టీ ఫంక్షనల్ గ్రిడ్ ఇంటరాక్టివ్ యస్పివి సిస్టమ్" అనే సిద్ధాంతానికి నవీన్ కుమార్ దిద్దికి పీహెచ్డీ డిగ్రీ పట్టా లభించగా యూనివ ర్సిటీ వైస్ ఛాన్సలర్ జి శంకర్ లింగం అధికారికంగా ప్రధానం చేశారు. ఈ పరిశోధన డాక్టర్ కె.వి.ఎన్. ఎస్. పవన్ కుమార్ పర్యవేక్షణలో జరిగింది. దీంతో యూనివర్సిటీ ఛాన్సలర్ సిహెచ్.వీ పురుషోత్తం రెడ్డి, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్ సిహెచ్.సాత్వికారెడ్డిలు అభినందించారు. ఈ సందర్భంగా యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ జీ.శంకర్ లింగం మాట్లాడుతూ.. ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ విభాగంలో పరిశోధ నలు జాతీయ అభివృద్ధికి ఎంతో కీలకమన్నారు. సింగిల్ పేజ్ సింగిల్ స్టేజ్ మల్టీ ఫంక్షన్ ఇంటరాక్టివ్ సోలార్ ఫోటో వోల్టాయిక్ (ఎస్పివి) వ్యవస్థ కోసం కొత్తగా ప్రతిపాదించబడిన అడాప్టివ్ కంట్రోల్ పద్ధతి ఈ రంగంలో గణనీయమైన పురోగతిని సూచిస్తుం దని ఆయన పేర్కొన్నారు. ఈ పద్ధతి ద్వారా వ్యవస్థ, స్థిరత్వం, సామర్థ్యం మరియు విద్యుత్ నాణ్యతను పెంచుతుందని ఆయన తెలిపారు. అదనంగా పరిశో ధన గ్రిడ్ సింక్రొనైజేషన్ హార్మోనిక్ తగ్గింపు మరియు రియాక్టివ్ పవర్ కాంపెన్సేషన్లో మెరుగైన పనితీరును ప్రదర్శిస్తుందని, ఇది చాలా ప్రశంసనీయమైన అభివృ ద్ధి మరియు పరిశోధన ప్రయత్నాలు ప్రజల అంచనాల ను మరియు సంక్షేమాన్ని ప్రతిబింబించాలని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రిజిస్టర్ యం.రవీం దర్, ఆచార్య క్రిస్టోఫర్, ఏ.రాజు, ఎం.జగదీశ్వర్, బి.చంద్రమౌళి, సుదీప్తిచంద్, పవన్ కుమార్, డాక్టర్ సిహెచ్.రామకృష్ణారెడ్డి, పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్ గాదె రాంబాబు రెడ్డి, అధ్యాపకులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ఉమ్మడి నల్గొండ జిల్లా స్థాయి డప్పుల పోటీలో ప్రథమ బహుమతి పొందిన సతీష్ మ్యూజిక్ అకాడమీ బృందం



**సూర్యాపేట జిల్లా మహా:** సూర్యాపేట జిల్లా గరిడేప ల్లి మండలానికి చెందిన సతీష్ మ్యూజిక్ అకాడమీ బృందం నల్గొండ జిల్లా మిర్యాలగూడ నియోజకవ ర్గం వేములపల్లి మండలం ఆమనగల్లు గ్రామంలో శ్రీ శ్రీ శ్రీ రామలింగేశ్వర స్వామి ఉత్సవాలల్లో భాగంగా నిర్వహించిన ఉమ్మడి నల్గొండ జిల్లా స్థాయి డప్పుల పోటీలో అద్భుతమైన డప్పుల ప్రదర్శన కనబరిచి మొదటి బహుమతిని సొంతం చేసుకున్నారు పోటీల అనంతరం దేవాలయ కమిటీ చైర్మన్ వల్లంపట్ల విద్యా సాగర్ రావు మరియు కమిటీ సభ్యుల చేతుల మీదుగా బహుమతినీ అందుకున్నారు ముఖ్య అతిథులుగా మి ర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మా రెడ్డి, ఎమ్మె ల్సీ శంకర్ నాయక్ గ్రామ సర్పంచ్. పిల్లల సందీప్ గ్రామ పెద్దలు యువకులు మహిళలు పోటీలను చూ డడానికి అధిక సంఖ్యలో పాల్గొన్నారు.సతీష్ మ్యూజిక్ అకాడమీ బృందాన్ని కవులు కళాకారులూ, రాజకీయ నాయకులు అభినందనలు తెలిపారు.

## నాణ్యత గల పౌరునిగా మానవ వనరుగా తీర్చిదిద్దబడినప్పుడే దేశ భవిష్యత్తులో మనం అభివృద్ధిలో మన పాత్ర ఉంటుంది

**డాక్టర్ గుమ్మడి నరేష్**



**హుజూర్ నగర్ మహా:**హుజూర్ నగర్ గవర్నమెం ట్ డిగ్రీ కళాశాలలో బుధవారం గెస్ట్ ఎక్స్టెన్షన్ క్లాస్ నిర్వహించబడింది మిర్యాలగూడ గవర్నమెంట్ డిగ్రీ కళాశాలలో పనిచేస్తున్న డాక్టర్ గుమ్మడి నరేష్ విద్యార్థు లకు డిగ్రీ తర్వాత భవిష్యత్తులో ఏ కోర్సులు ఉన్నాయో ఏ కోర్సులు చేయడం వలన మంచి ఉద్యోగ భవిష్యత్తు ఉంటుందో తెలియజేశారు జాబ్ ఆపర్చునిటీస్ వైపు దృష్టి మళ్లించాలని టెక్నికల్ గా మనిషి అభివృద్ధి చెందాలని నాణ్యత గల పౌరునిగా మనం మానవ వనరుగా తీర్చిదిద్దబడినప్పుడే దేశ భవిష్యత్తులో మనం అభివృద్ధిలో మన పాత్ర ఉంటుంది కాబట్టి నేటి యువ ఆర్థికంగా అభివృద్ధి చెందాలని అర్థశాస్త్రంతో ఏఐకి మంచి సంబంధం కలదని మంచి ఆర్థికవేత్తగా ఎదగాలని తెలియజేశారు ఈ కార్యక్రమాన్ని ఉద్దేశిం చి ప్రిన్సిపాల్ సోమపొంగు రామారావు మాట్లాడుతూ అభివృద్ధి చెందిన దేశంలో యువత పాత్ర చాలా బాగుంటుందని తప్పకుండా మీ వంతు పాత్ర పోషిం చాలని సమాజానికి తయారయ్యే మంచి పౌరుడిగా మీరందరూ ఎదగాలన్నారు.

# పేదల సొంతింటి కల నిజం..

## ఇందిరమ్మ రాజ్యంతోనే సామాన్యుడికి న్యాయం!



**ఆమనగల్లు, మహా :** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో పేదల సొంతింటి కలను నెరవేర్చేం దుకు ఇందిరమ్మ ఇండ్ల పథకం ప్రారంభమైందని టీపీసీసీ సభ్యులు ఆయిళ్ల శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. మైసిగండి గ్రామంలో జర్పుల సోనా బిచ్య నాయక్ ని ర్మించుకున్న ఇందిరమ్మ ఇల్లును ఆయన ప్రారంభిం చారు. ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి సహకారంతో నియోజకవర్గం అభివృద్ధి పథంలో సాగుతోందని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇల్లు అందుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ప్రేమ జహర్ లాల్, ఉప సర్పంచ్ హిరాసింగ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్య క్షుడు యాట నరసింహ, డీసీసీ ప్రతినిధి శ్రీనివాస్ రెడ్డి మరియు ఇతర నాయకులు పాల్గొన్నారు.

## ప్రాపర్టీ ట్యాక్స్ చెల్లించండి: కమిషనర్



**ఆమనగల్లు, మహా :** ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని పట్టణ ప్రజలు తమ ఇంటి ప్రాపర్టీ ట్యాక్స్ పాటు ఇతర బకాయిలను వెంటనే చెల్లించాలని ము న్సిపల్ కమిషనర్ శంకర్ నాయక్ కోరారు. పన్నులు సకాలంలో చెల్లిస్తేనే సిబ్బందికి జీతాలు ఇవ్వడం సాధ్యమని తెలిపారు. ట్యాక్స్ కలెక్షన్ పురోగతిని బట్టి ఆర్థిక సంఘం నిధులు విడుదల అవుతాయని పేర్కొ న్నారు. ఆన్లైన్, మీ సేవాకేంద్రాలు లేదా బిల్ కలెక్టర్ ద్వారా ఈ రోజే పన్నులు చెల్లించాలని సూచించారు.

## గ్రామ సమగ్ర అభివృద్ధిలో సర్పంచుల పాత్ర కీలకం

**జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్**



**సూర్యాపేట జిల్లా మహా:** సూర్యాపేట జిల్లా కేంద్రంలో జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయంలో నూతనంగా ఎన్ని కైన సర్పంచులకు ఐదు రోజుల శిక్షణ కార్యక్రమానికి కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ హాజరయ్యారు. సర్పంచులకు ఈనెల 2 నుండి 7వ తేదీ వరకు 3వ విడత సూర్యాపేట , ఆత్మకూర్ (ఎస్), మునగాల,చి వ్వేంల పెన్‌పహాడ్ మండలాల సర్పంచులకు శిక్షణ ఇస్తున్నారు శిక్షణ కార్యక్రమానికి హాజరైన కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ మాట్లాడుతూ సర్పంచు లు పంచాయతీరాజ్ చట్టం, ప్రభుత్వ పథకాలపై సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. గ్రామపంచాయతీ పనుల నిర్వహణ, గ్రామ అభివృద్ధి ప్రణాళికల రూపకల్పన, ప్రభుత్వం అమలు చేస్తున్న కుటుంబ సంక్షేమం, విద్య, ప్రజారోగ్యం, సామాజిక అభివృద్ధి వంటి అంశాలపై ఈ శిక్షణలో అవగాహన కల్పిస్తున్నామన్నారు. అందువల్ల ప్రతి ఒక్క సర్పంచ్ ఈ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. తద్వారా తమ గ్రామాలను ఆదర్శ గ్రామాలుగా తీర్చి దిద్దుకోవాలని సూచించారు. మారుతున్న కాలానికి అనుగుణంగా సాంకేతికతను వినియోగించుకోవాల ని, సాంకేతిక అంశాల పట్ల కూడా అవగాహన కలిగి ఉండాలని సూచించారు. తద్వారా ప్రజా సౌకర్యాలపై మరింత శ్రద్ధ పెట్టవచ్చని అన్నారు. కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి యాదగిరి, సర్పంచులు పాల్గొన్నారు.



## చదువు కోసం వీసాపై వచ్చి డ్రగ్స్ దందా మొదలుపెట్టిన యువకులు

**అరంఘర్ చౌరస్తా వద్ద భారీ డ్రగ్స్ రాకెట్ ను చేదించిన పోలీసులు**

**రాజేంద్రనగర్, మహా :** రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని అరంఘర్ చౌరస్తా వద్ద భారీ డ్రగ్స్ రాకెట్‌ను నార్కోటిక్ ఎన్ఫోర్స్మెంట్ తో కలిసి రాజేంద్ర నగర్ పోలీసులు చేదించారు. రాజేంద్రనగర్ డిసిపి కార్యాలయంలో మాట్లాడుతూ నార్కోటిక్ ఎన్ఫో ర్స్మెంట్ తో కలిసి రాజేంద్రనగర్ పోలీసులు టాస్క్ ఫోర్స్ పోలీసుల సహాయంతో భారీ డ్రగ్స్ రాకెట్ ను ఛేదించారు. మంగళవారం నిర్వహించిన ఆపరేషన్ లో ఇద్దరు విదేశీయులను అదుపులోకి తీసుకున్నారు. A1 హసన్,(28) (A2) మొహమ్మద్ అబ్దు రాబు,(37) యమన్ దేశానికి చెందిన వ్యక్తులు. చదువుకోవడా నికి వీసా పై హైదరాబాద్ వచ్చారు. ఇద్దరికీ డ్రగ్స్ తీసుకుని అలవాటు ఉండటంతో ఇద్దరూ డ్రగ్స్ పెడ్ర్లుగామారారు. రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ పరిధి లోని ఆరాంఘర్ చౌరస్తా మెట్రో కన్వెన్షన్ సమీపంలో డ్రగ్స్ అమ్మడానికి సహాయకుల కోసం ప్రయత్నిస్తుం డగా విశ్వసనీయ సమాచారం మేరకు హైదరాబాద్ నార్కోటిక్ ఎన్ఫోర్స్మెంట్ తో కలిసి పోలీసులు వీరిని అదుపులోకి తీసుకున్నారు. ఈ డ్రగ్స్ ను బెంగళూరులో విదేశీయుని వద్ద నుండి హైదరాబాద్ కు తరలిస్తున్న ట్టు పోలీసులు గుర్తించారు. వీరి వద్ద నుండి 25 లక్షలు విలువ చేసే 150 గ్రాముల ఎండి డ్రగ్స్, ఒక కత్తి, 4 సెల్ ఫోన్లు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరిపై దేశంలో పలు కేసులు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. వీరిపై 236/2026 ఎన్ డి పి ఎస్ కింది కేసు నమోదు చేశారు. విదేశాల నుంచి వచ్చి అనుమానస్పదంగా సంచరిస్తు కనిపించే వ్యక్తుల గురించి ప్రజలు పోలీసు లకు తెలియజేయాలని రాజేంద్రనగర్ డిసిపి శ్రీనివాస్ కోరారు. మాదకద్రవ్యాలపై తెలంగాణ ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుందన్నారు. ఏలాంటి కార్యకలాపా లు కనిపించిన వెంటనే పోలీసులకు తెలియజేయాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో ఏ సి పి తుల శ్రీనివా స్, రాజేంద్రనగర్ ఇన్స్పెక్టర్ ముత్తు యాదవ్ , నార్కోటి క్ పోలీసులు, పాల్గొన్నారు.

## వార్డు సమస్యలపై వినతి



**ఆమనగల్లు, మహా :**ఆమనగల్ మున్సిపాలిటీ 12వ వార్డులో సీసీ రోడ్లు, ఇంటింటి మిషన్ భగీరథ నీటి కనె క్షన్లు, వాటర్ కలెక్షన్ సమస్యలు, అండర్ గ్రౌండ్ డ్రైనేజ్, వీధిలైట్లు, పాత గోడల మరమ్మతులు, ఆసరా పింఛన్ల అంశాలపై వార్డు కౌన్సిలర్ నాగిళ్ల జగన్ మున్సిపల్ కమిషనర్ శంకర్ నాయక్కు వినతిపత్రం ఇచ్చారు. సమ స్యలను త్వరితగతిన పరిష్కరించాలని కోరారు. ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

## అధికారులపై అదనపు కలెక్టర్‌కు ఫిర్యాదు..?

**సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలి:బీఆర్ఎస్**



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:**ఇబ్రహీంపట్నం మున్సిపల్ ఎన్నికలలో నిబంధనలను ఉల్లంఘించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని, ఉన్నతాధికారు లకు ఫిర్యాదు చేసిన బిఆర్ఎస్ నాయకులు. రంగారెడ్డి జిల్లా, ఇబ్రహీంపట్నం మున్సిపల్ చైర్మన్ ఎన్నికలో ఎన్నికల నిబంధనలు తుంగలో తొక్కారంటూ ఆరో పిస్తూ, రిటర్నింగ్ అధికారి ఆర్డిఓ అనంతరెడ్డి, ఏసిపి కేపివి రాజులను వెంటనే విధుల్లోంచి తొలగించి, సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్, పోలీస్ కమీషనర్ లకు ఫిర్యాదు చేసినట్లు బిఆర్ఎస్ పార్టీ నాయకులు తెలిపారు. ఫిర్యాదు పై ఉన్నతాధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటారు అనేది వేచి చూడాలి.

## హోలీ పండుగ సందర్భంగా కార్మికులతో కలిసి వేడుకల్లో పాల్గొన్న టీఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శీతల రోషపతి



**హుజూర్ నగర్ మహా:**దీపావళి మందుల తయారీ సమయంలో జరిగిన ప్రమాదంలో మరణించిన ప్రతి కుటుంబానికి పరిశ్రమ యాజమాన్యం నుంచి రూ.50 లక్షల చొప్పున పరిహారం ఇవ్వాలని టీఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శీతల రోషపతి డిమాండ్ చేశారు. హుజూర్ నగర్‌లో హోలీ పండుగ సందర్భం గా కార్మికులతో కలిసి వేడుకల్లో పాల్గొన్న సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్‌లోని వేట్లపాలెం సమీపంలో పంట పొలాల మధ్య "సూర్యశ్రీ ఫైర్‌వర్క్స్" పేరుతో కొన్నేళ్లుగా దీపావళి మందులు తయారు చేస్తు న్నారని తెలిపారు. ఈ నెల 28న జరిగిన భారీ పేలుడు ప్రమాదంలో 23 మంది పైగా కార్మికులు మృతి చెంది నట్లు ఆయన అన్నారు. ఈ ప్రమాదంపై ఆంధ్రప్రదేశ్ ప్ర భుత్వం వెంటనే స్పందించి, ముఖ్యమంత్రి స్వయంగా ఘటనాస్థలికి వెళ్లడం, మృతి చెందిన ప్రతి కుటుంబా నికి రూ.20 లక్షల చొప్పున పరిహారం ప్రకటించడం, గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించడాన్ని ఆయనఅభినందించారు. ఇలాంటి ప్రమాదాలు మళ్లీ జరగకుండా ఉండాలంటే అధికారులు పరిశ్రమల్లో కార్మికులకు అన్ని భద్రతా ఏర్పాట్లు ఉన్నాయో లేదో పరిశీలించి తర్వాతే అనుమతులు ఇవ్వాలని ఆయన కోరారు. అలాగే ప్రమాదం జరిగిన పరిశ్రమపై కఠిన చర్యలు తీసుకుని దాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. హోలీ పండుగ సందర్భంగా కార్మికులతో కలిసి రంగులు చల్లుకుంటూ వేడుకలు నిర్వహించారు. అలాగే ఈ నెల 10వ తేదీన ముఖ్యమంత్రి హుజూర్నగర్ నియోజకవర్గంలో ఇందిరమ్మ ఇండ్ల పంపిణీ కార్యక్ర మంనిర్వహించనున్నారని ప్రచారం జరుగుతోందని చెప్పారు. మొదటగా కాల్వ పక్కన, రోడ్ల పక్కన నివసిస్తు న్న వారికి ఇళ్లు కేటాయించేటప్పుడు ప్రాధాన్యం ఇవ్వా లని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో వెంకన్న, నాగ రాజు, శ్రీను, రాంబాబు, రాజేష్, కనకయ్య పాల్గొన్నారు.

### రాజేంద్రనగర్ లో రంగుల పండుగ హోలీలో

# రాజకీయ నాయకుల హోరు



**రాజేంద్రనగర్, మహా ;** రాజేంద్రనగర్ నియోజ కవర్గంలోని మైలార్ దేవ్ పల్లి డివిజన్ పరిధిలోని కాటేదాన్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ లో వివేకానంద యోగ సమితి, వాకర్ అసోసియేషన్ సభ్యులు వివిధ క్రీడాకా రులతో కలిసి హోలీ సంబరాలు జోరుగా జరిగాయి. వివిధ పార్టీల నాయకులు చిన్న పెద్ద తేడా లేకుండా అందరూ కలిసి రంగులు పూసుకుంటూ చిందులు వేస్తూ హోలీ పండుగను బుధవారం విజయానికి గుర్తుగా జరుపుకున్నారు. పల్లె పట్టణం అనే తేడా లేకుండా ఏ ఏరియాలో చూసిన యువతులు, యువకులు, చిన్నారులు, పెద్దలు హోలీ సంబరాలతో కనువిందు చేశారు. హోలీ సంబరాల్లో, యువకులు, పెద్దలు చిన్నారులు రంగుల్లో మునిగితేలారు. విజయానికి గుర్తుగా హోలీ సంబరాలను గ్రాండ్ గా సెలబ్రేషన్ చేసుకున్నారు..

## 55వ జాతీయ భద్రతా వారోత్సవాలను ప్రారంభించిన డెక్కన్ సిమెంట్స్ కర్మాగారం



**సూర్యాపేట జిల్లా మహా** సూర్యాపేట జిల్లా పాలకవీ డు మండలం, (భవానిపురం) సున్నపురాయి ఘని, డెక్కన్ సిమెంట్స్ లిమిటెడ్ కర్మాగారంలో 55 వ జాతీయ భద్రతా వారోత్సవాలను బుధవారం డెక్కన్ సిమెంట్స్ లిమిటెడ్ సంస్థ చీఫ్ జనరల్ మేనేజర్ (పిఅండ్ఏ) ఎస్ నాగమల్లేశ్వర రావు, సేఫ్టీ కమిటి జనరల్ సెక్రటరి పి.యస్.రావ్ లు సంయుక్తంగా జెండా ఎగురవేసి, కంపెని కార్మికులు,స్టాఫ్, సెక్యూ రిటి సిబ్బందితో కలిసి జాతీయ గీతాలాపన, భద్రతా శపథం చేసి వారోత్సవాలను ప్రారంభించారు.ఈ సందర్భంగా సంస్థ చీఫ్ జనరల్ మేనేజర్ ఎస్.నాగ మల్లేశ్వర రావ్ మాట్లాడుతూ 2026 సంవత్సరపు జాతీయ భద్రతా నినాదం అయిన భద్రతను పెంపొం దించటానికి ప్రజలను నిమగ్నం చేయండి మరియు వి ద్యావంతులుగా మార్చి శక్తివంతులను చేయండి.అనే నినాదం గురించి వివరిస్తూ భద్రతను పెంపొందించే విషయం లో ప్రజలను విద్యావంతులను చేయటం మరియు వారికి భద్రత యొక్క అవగాహనను కల్పిం చటం ద్వారా సమాజంలో, పని ప్రదేశాల వ్యవస్థలో లోపాలు తలెత్తి ప్రమాదాలు జరగకుండా నివారిం చేట్లు మరియు ఆకస్మిక ప్రమాదాలను సయితం సమ ర్థవంతంగా ఎదుర్కొనేట్లు ప్రజలను శక్తివంతులుగా మార్చి ప్రజల భాగస్వామ్యంతో వ్యవస్థను పటిష్టం చేయాలని తెలిపారు.

ANN తెలుగు
మహా పత్రిక


## మార్చి రెండవ వారంలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా మోడల్ హౌసింగ్ కాలనీ ప్రారంభం

### ఆహార పౌర సరఫరాలు మరియు నీటిపారుదల శాఖ మంత్రి నల్లమాధ ఉత్తమ్ కుమార్ రెడ్డి



**హుజూర్ నగర్ మహా:** హుజూర్ నగర్ నియోజకవర్గ కేంద్రంలోని రామస్వామి గుట్టవద్ద 110 ఎకరాలలో నిర్మించిన మోడల్ హౌసింగ్ కాలనీని ఈ నెల రెండవ వారంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించనున్నట్లు రాష్ట్ర నీటిపారుదల,పౌర సరఫరాల శాఖామంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారుబుధవారం హుజూర్ నగర్ నియోజకవర్గ కేంద్రంలోనీ రామస్వామి గుట్ట వద్ద నిర్మించిన మోడల్ హౌసింగ్ కాలనీని ఆయన పరిశీలించారు.అనంతరం మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ, ఆదర్శ గృహ కాలనీ ప్రారంభానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఆహ్వానించినామన్నారు అవసరమైతే అదనపు సమయం పనిచేసి అయినా వచ్చే ఒక వారంలో అన్ని పనులు పూర్తి చేయాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు.హుజూర్‌నగర్ సమీపంలోని రామస్వామి గుట్టలో 110 ఎకరాల విస్తీర్ణంలో ఈ కాలనీ నిర్మించబడిందని,ఇందులో 2,160 కుటుంబాలకు సింగిల్ బెడ్‌రూమ్ ఇళ్లు కేటాయించనున్నామన్నారు.ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో గృహ నిర్మాణ శాఖ మంత్రిగా ఉన్నప్పుడు ఈ ప్రాజెక్ట్‌ను ప్రారంభించిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. అయితే 2014 లో రాష్ట్ర విభజన తర్వాత ఈ ప్రాజెక్ట్ నిర్లక్ష్యానికి గురైందన్నారు.2023లో కాంగ్రెస్ పార్టీ మళ్లీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ ప్రాజెక్ట్ పునరుద్ధరణకు చర్యలు ప్రారంభించినట్లు మంత్రి తెలిపారు. ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్‌లో గృహ నిర్మాణ శాఖా మంత్రిగా ప్రారంభించిన ఈ ప్రాజెక్ట్‌కు ఎట్టకేలకు తిరిగి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాకే తుదిదశకు చేరుకుందన్నారు. 110 ఎకరాల విస్తీర్ణంలో రూ.125 కోట్ల వ్యయంతో (భూసేకరణ ఖర్చులు మినహా, ఎకరానికి రూ.1 కోట్లకు పైగా చెల్లించ బడింది)ఈ గృహ కాలనీ నిర్మించబడింది.మొత్తం 2,160 ఆధునిక సింగిల్ బెడ్‌రూమ్ ఫ్లాట్లు నిర్మించి అంతే సంఖ్యలో కుటుంబాలకు వసతి కల్పించనున్నారు.ఈ భూమిని ఎండోమెంట్స్ శాఖ నుంచి పూర్తి మార్కెట్ విలువ చెల్లించి, చట్టబద్ధమైన అన్ని అనుమతులతో ప్రభుత్వమే కొనుగోలు చేసిందని మంత్రి స్పష్టం చేశారు.మార్కెట్ విలువ చెల్లించి ఎండోమెంట్స్ శాఖ నుంచి భూమిని కొనుగోలు చేసి,అన్ని చట్టపరమైన నిబంధనలు పాటిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఈ కాలనీ నిర్మాణం చేపట్టిందని మంత్రి వివరించారు. ఒకప్పుడు నిర్లక్ష్యానికి గురైన ఈ ప్రాంతాన్ని సుసంపన్నమైన కాలనీగా తీర్చిదిద్దేందుకు సమగ్ర ప్రణాళికతో ముందుకెళ్లినట్లు ఆయన చెప్పారు.ఈ ప్రాజెక్ట్ ముఖ్యంగా ఆర్థికంగా వెనుకబడిన వర్గాలు, అత్యంత పేద కుటుంబాలు, గ్రామీణ కూలీలు, రైస్ మిల్ కార్మికులు, హుజూర్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలోని ప్రజలు మరియు సమీప గ్రామాల నివాసితుల కోసం ఉద్దేశించబడింది.లబ్ధిదారుల ఎంపిక పూర్తిగా పారదర్శకంగా జరగాలని మంత్రి దృష్టి పెట్టారు. స్థానిక రెవెన్యూ డివిజనల్ అధికారి ఆధ్వర్యంలో అధికారుల బృందానికి ఈ బాధ్యత అప్పగించినట్లు ఆయన తెలిపారు.లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా ఉండాలని, అర్హత లేని వారికి ఈ జాబితాలో పేరు ఉండకూడదని అని మంత్రి స్పష్టం చేశారు.మొదటి దశలో కేవలం 1,000 మంది లబ్ధిదారులను మాత్రమే ఖరారు చేస్తున్నామని అత్యంత అర్హులైన వారికి ప్రాధాన్యం ఇచ్చి, సూక్ష్మంగా పరిశీలించి ఎటువంటి అవకతవకలకు తావు లేకుండా ఈ ప్రక్రియ చేపడుతున్నట్లు ఆయన చెప్పారు.ప్రారంభోత్సవానికి సన్నాహాలు కొనసాగుతున్నాయని కాలనీ మరియు పరిసర ప్రాంతాలను సుందరీకారుస్తున్నట్లు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ శంకర్ నాయక్, జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్, జిల్లా ఎస్పీ కె నరసింహ, హౌసింగ్ పీడీ సిద్ధార్థ, అర్టికల్చర్ పిడి నాగయ్య, ఆర్డీవో శ్రీనివాసులు, మున్సిపల్ చైర్పర్సన్ శ్రీనివాస్, వైస్ చైర్మన్ తన్నీరు మల్లికార్జున్, జిల్లా డీసీసీ అధ్యక్షులు నరసయ్య, తహసిల్దార్ కవిత, ఇతర జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మార్చి 6 నుండి జూన్ 12 వరకు ప్రజాపాలన ప్రగతి

### జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి




**యాదాద్రి భువనగిరి, మహా:** మార్చి 6 నుండి జూన్ 12 వరకు నిర్వహించే "ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక" కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో కలెక్టర్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు,రెవిన్యూ అదనపు కలెక్టర్ వెంకా రెడ్డి వివిధ శాఖల జిల్లా అధికారులతో కలెక్టర్ సమావేశం ఏర్పాటు చేసి దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లడుతూ 99 రోజులకు యాక్షన్ ప్లాన్ తయారు చేయాలన్నారు.ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజల్లోకి తీసుకుని వెళ్లాలి అన్నారు. ఇందుకు అవసరమైన చర్యలు తీసుకునేందుకు పూర్తి నివేదికలు తయారు చేయాలన్నారు.శానిటేషన్, పెండింగ్ ఫైల్స్,రెవిన్యూ శాఖ లో పెండింగ్ ఫైల్స్, హెల్త్, హౌసింగ్, ఎడ్యుకేషన్, అంగన్వాడీ, అగ్రికల్చర్, హాస్టల్, ధాన్యం కొనుగోలు, వంటి వివిధ శాఖల అధికారులు విధి విధానాలు ప్రజలకు తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి నాగిరెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి జయ, ఆర్డీవోలు కృష్ణారెడ్డి, శేఖర్ రెడ్డి సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిని ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి

**భువనగిరి, మహా:** ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే పేషెంట్లకు మెరుగైన వైద్య చికిత్స అందించాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లడుతూ ఆసుపత్రిలోని ఎన్ని విభాగాలు ఉన్నాయని, ఎంత మంది డాక్టర్ లు ఉన్నారని, ఎంత మంది సిబ్బంది ఉన్నారని సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు.ప్రతిరోజు సగటున ఎంతమంది ఇన్ పేషెంట్ గా అడ్మిట్ అవుతున్నారని తెలుసు కున్నారు. ఆసుపత్రిలో ఉన్న వార్డు లను కలియ తిరిగారు,ఇన్ పేషెంట్ తో కలెక్టర్ మాట్లాడుతూ వైద్య సిబ్బంది మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నారా, మంచి ఆహారం పెడుతున్నారా అని ఆరా తీశారు. రోగులకు అందిస్తున్న వైద్య సేవలు, అందుబాటులో ఉన్న సదుపాయాలను పరిశీలించారు. అవసరమైన ఔషధాలు అన్ని అందుబాటులో ఉన్నాయా అని ఆరా తీశారు. గడువు ముగిసిన మందులను చెక్ చేయాలన్నారు. పేషెంట్లకు మందులు ఇచ్చే ముందు ఒకటికి రెండుసార్లు చెక్ చేయాలి అన్నారు. పేషంట్లకి అవసరమైన అన్ని రకాల మందులు అందుబాటులో ఉంచాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే గర్భిణీ స్త్రీలకు వివిధ రకాల టెస్టులను ప్రభుత్వ ఆసుపత్రిలోనే చేయాలన్నారు.గర్భిణీ స్త్రీలకు మెరుగైన వైద్యం అందించాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రులలో ప్రసవాల సంఖ్య పెంచాలన్నారు.




## అంగన్వాడీ కేంద్రాన్ని పరిశీలించిన కౌన్సిలర్ కొతి సంపత్ రెడ్డి



**హుజూర్ నగర్ మహా:** హుజూర్ నగర్ పట్టణంలోని సీతారాం నగర్ 25వ వార్డులో గల అంగన్వాడి కేంద్రాన్ని బుధవారం వార్డు కౌన్సిలర్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కోతి సంపత్ రెడ్డి,సులువ చంద్రశేఖర్ తో కలిసి పర్యవేక్షించడం జరిగింది.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రానికి వచ్చే పిల్లలకు, గర్భిణీలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా చూసుకోవాలని నాణ్యత మైన భోజనం, పౌష్టికాహారం అందించాలని, పాల ప్యాకెట్ల విషయంలో జాగ్రత్త వహించాలని సూచించారు.ఈ సందర్భంలో అంగన్వాడీ కేంద్రం శాశ్వత కేంద్రం ఏర్పాటు చేయాలని వారు సంపత్ రెడ్డి దృష్టికి తీసుకు వెళ్ళగానే, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మరియు మున్సిపల్ చైర్మన్ దొంతగాని శ్రీనివాస్ గౌడ్ దృష్టికి తీసుకెళ్లి శాశ్వత అంగన్వాడీ కేంద్రాన్ని ఏర్పాటు చేయడానికి కృషి చేస్తానన్నారు. స్టోర్ రూమ్ లో చిన్న పిల్లలకు మరియు గర్భిణీలకు ఇచ్చే గుడ్ల ను మరియు బాలామృతం ప్యాకెట్స్ ను వారు పరిశీలించడం జరిగింది, అక్కడికి సదుపాయాలకు సంబంధించిన విషయాన్ని సొంత ఖర్చులతో ఏర్పాటు చేస్తానన్నారు.ఈ సందర్భంగా రోజి అనే పాపతో అక్షర అభ్యాసం చేయించారు. అంగన్వాడి కేంద్ర నిర్వాహకురాలు ఎండి నజీమా బేగం కౌన్సిలర్లను ఘనంగా శాలువాతో సన్మానించడం జరిగింది.ఈ కార్యక్రమంలో బి ఎల్ ఓ సహారాబాను, అంగన్వాడీ ఆయా వరలక్ష్మి మరియు కాంగ్రెస్ పార్టీ నాయకులు యాల్లవుల వీరయ్య,తోట ఉపేందర్, ములకలపల్లి వెంకటేష్, మీసాల గోపి, తమ్మిశెట్టి నరసింహారావు, ములకలపల్లి శ్రీను, తురక రమేష్, దగ్గుపాటి బాబురావు తదితరులు పాల్గొన్నారు

## సూర్యాపేట జిల్లా ఆర్యవైశ్య యువజన సంఘం ఆధ్వర్యంలో 10వ తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు పంపిణీ



**సూర్యా పేట జిల్లా మహా:** సూర్యాపేట జిల్లా యువజన సంఘం ఆధ్వర్యంలో బుధవారం ప్రభుత్వ నెంబర్ 2 స్కూల్ లో పదవ తరగతి పరీక్షలకు సన్నదమవుతున్న 54 మంది విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లను అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా ఆర్యవైశ్య మహాసభ కోశాధికారి చల్లా లక్ష్మీకాంత్,యువజన సంఘం అధ్యక్షులు బొమ్మిడి అశోక్ లు మాట్లాడుతూ విద్యారులు ఇష్టపడి చదివి మంచి ఉత్తీర్ణత సాధించాలని తెలిపారు.10 వ తరగతి లో పాఠశాలలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు రూ.5116 నగదు బహుమతి అందజేస్తామని తెలిపారు జిల్లా ఆర్యవైశ్య యువజన సంఘం నాయకులు యమా సంతోష్ మాట్లాడుతూ స్కూల్ లోవిద్యాబుద్ధులు నేర్పుతున్న ఉపాధ్యాయురాలు కోరిక మేరకు ప్యాడ్స్ పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్య వైశ్య మహాసభ నాయకులు శ్రీరంగం రాము తదితరులు పాల్గొన్నారు.

## కోదాడ నియోజకవర్గాన్ని వ్యవసాయంలో సస్యశ్యామలం చేస్తా..

- రెడ్లకుంట ఎత్తిపోతల ప్రాజెక్టును మే నెల చివరి వరకు నిర్మాణ పనులను పూర్తి చేయాలి
- రాష్ట్ర ఆహార పౌరసరఫరాల మరియు నీటిపారుదల శాఖ మంత్రి నల్లమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి



**సూర్యాపేట జిల్లా మహా:** రెడ్లకుంట ఎత్తిపోతల పథకం నిర్మాణ పనులు వేగం పెంచాలని, నాణ్యతా ప్రమాణాల్లో రాజీ పడవద్దని మే నెల చివరి వరకు ఎత్తిపోతల పథకం నిర్మాణ పనులను పూర్తి చేయాలని అధికారులను,కాంట్రాక్టర్ లను మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆదేశించారు. బుధవారం పాలేరు వాగుపై రెడ్లకుంట వద్ద నిర్మిస్తున్న రెడ్ల కుంట ఎత్తిపోతల పథకం నిర్మాణ పనులను అధికారులతో కాంట్రాక్టర్లతో కలిసి పరిశీలించారు. తదుపరి మాట్లాడుతూ ఎస్సీ ఎస్టీ బీసీ బలహీన వర్గాల ప్రజలకు మేలు చేసేందుకే ప్రజా ప్రభుత్వం ఆధ్వర్యంలో నియోజక వర్గంలో పలు ఎత్తిపోతల పథకం నిర్మాణ పనుల ప్రాజెక్టులు చేపట్టామని, రెడ్ల కుంట వద్ద రూ.14 కోట్ల రూపాయలతో ఎత్తిపోతల పథకాన్ని చేపట్టామని,ఈ పథకం ద్వారా నల్లబండగూడెం, కాపుగల్లు, రెడ్ల కుంట పరిధిలో 4,500 ఎకరాలకు సాగునీరు అందుతుందని అలాగే గ్రామాలలో త్రాగునీరు కూడ అందించడం జరుగుతుందని, ప్రాజెక్టు భూసేకరణ నిమిత్తం 3 ఎకరాల 39 కుంటల భూమి సేకరించి రైతులకు 2 కోట్లు చెల్లించనైనదని,ఈ ఖరీఫ్ సీజన్లో దేశంలో ఎక్కడలేని విధంగా తెలంగాణలో అత్యధిక వరి పంట పండి రికార్డ్స్ సృష్టించినదని, మొత్తం 72 లక్షల మెట్రిక్ టన్నుల వరి పండినదని, రైతుల నుండి కొనుగోలు,బోనస్ మొత్తము కలిపిరూ.19,800 కోట్లు చెల్లించామని, రాజకీయాలకు అతీతంగా కోదాడ, హుజూర్ నగర్ రెండు నియోజకవర్గాలను అభివృద్ధి చేస్తామని మంత్రి అన్నారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ సిఇ, రమేష్,ఆర్డిఓ సూర్య నారాయణ, నీటిపారుదల అధికారులు, గుత్తందారులు, అధికారులు స్థానిక ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

## హోలివేడుకల్లో పాల్గొన్న ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య



**యాదాద్రి భువనగిరి, మహా:** హోలీ సందర్భంగా బంజారాలతో కలిసి నృత్యం చేశారు ప్రభుత్వ విప్,ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య బొమ్మలరామారం మండలం గోవింద్ తండాలో హోలీ వేడుకల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. బుధవారం హోలీ సందర్భంగా తండా వాసులతో కలిసి రంగులు చల్లుకున్నారు. బంజారా సోదర సోదరీమణులతో కలిసి సాంప్రదాయ నృత్యం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హోలీ పండుగ సోదరభావం, ఐక్యతకు ప్రతీక అని అన్నారు. గోవింద్ తండా అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని హామీ ఇచ్చారు. ప్రజల సమస్యలు తెలుసుకొని పరిష్కరించేందుకు ఎప్పుడూ సిద్ధంగా ఉంటామని తెలిపారు.

## మెనుప్రకారం నాణ్యమైన భోజనం అందించాలి

### జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి



**భువనగిరి, మహా:** బాలసదనంలో ఉన్న విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అన్నారు. బుధవారం భువనగిరి లో గల మీనానగర్ లోని బాల సదనంను జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి ఆకస్మిక తనిఖీ చేశారు. బాలసదనంలో ఎంతమంది సిబ్బంది ఉన్నారని,అటెండన్స్ రిజిస్టర్ ను పరిశీలించారు. ఎంత మంది విద్యార్థులు ఉన్నారని, విద్యార్థులు ఏ ఏ తరగతులు చదువుతున్నారని అడిగి తెలుసుకున్నారు. బాలసదనం లో ఉన్న పిల్లలతో కలెక్టర్ ముచ్చటించారు. రుచి కరమైన భోజనం అందిస్తున్నారా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులను మీకు ఏమి అయినా కావాలా అని అడగగా పిల్లలు మ్యూజిక్ టీచర్ కావాలని తెలుపగా పిల్లల కోరిక మేరకు మ్యూజిక్ టీచర్ ను తాత్కాలికంగా నియమించాలని సంబంధిత అధికారులను అదేశించారు. విద్యార్థులందరికీ హెల్త్ ప్రొఫైల్ ఉందా అని అడిగి తెలుసుకున్నారు. బాలసదనం లో వాటర్ ఫిల్టర్ పనిచేయడం లేదని తెలపడంతో వెంటనే మరమ్మతులు చేయించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. బెడ్ షీట్ లు సరిగా లేకపోవడం తో కొత్త బెడ్ షీట్లు ఇవ్వాలని సూచించారు.అనంతరం నిర్మాణంలో ఉన్న బాలసదనం భవనం యొక్క వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమం లో జిల్లా సంక్షేమ అధికారి నరసింహ రావు. మున్సిపల్ కమిషనర్ రామలింగం భువనగిరి తహసీల్దార్ జగన్ మోహన్ ప్రసాద్, బీ ఆర్ బీ కో ఆర్డినేటర్ అనంత లక్ష్మీ, యశోద,బాలసదన్ పాల్గొన్నారు.

## సీసీ రోడ్లు ప్రారంభోత్సవం

### సర్పంచ్ సలిగంజి పృధ్వి

**వలిగొండ, మహా :** వలిగొండ మండలంలోని గోపరాజుపల్లి గ్రామంలో బుధవారం సిసి రోడ్లను స్థానిక సర్పంచ్ సలిగంజిపృధ్వి ప్రారంభోత్సవం చేశారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే అనిల్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో గోపరాజుపల్లి లో ప్రజా సమస్యలు పరిష్కరించడంలో ముందుంటానని ఎమ్మెల్యే అండదండలతో గ్రామాన్ని అభివృద్ధి పథంలో తీసుకువెళ్తానని ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికి చేరే విధంగా కృషి చేస్తానని ఆయన అన్నారు పార్టీలకు అతీతంగా రాజకీయాలకు అతీతంగా పనిచేస్తానని అన్నారుఈ కార్యక్రమంలో స్థానిక వార్డు సభ్యులు నాయకులు తదితరులు పాల్గొన్నారు

# గ్యాస్‌కు యుద్ధం సెగ

**ఎల్ఎన్‌జీ ఉత్పత్తి నిలిపివేసిన ఖతర్.. భారత్‌కి సరఫరాపై ప్రతికూల ప్రభావం**
**దేశీయంగా పరిశ్రమలకు 40% వరకు కోత.. ఆందోళనలో పరిశ్రమలు, సిటీ గ్యాస్ ఆపరేటర్లు**




**న్యూఢిల్లీ:** ఇజ్రాయెల్, అమెరికా-ఇరాన్ యుద్ధం, భారత్‌కి తలనొప్పి వ్యవహారంగా మారింది. కీలకమైన రస్ లఫాన్ ప్లాంటుపై ఇరాన్ డ్రోన్ల దాడుల దెబ్బతో ఖతర్ ఉత్పత్తిని నిలిపివేయడంతో భారత్‌కి ఎల్ఎన్‌జీ సరఫరాపై తీవ్ర ప్రభావం పడుతోంది. దీనితో దేశీయంగా పరిశ్రమలు, సిటీ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ (సీజీడీ) కంపెనీలకు ద్రవీకృత సహజ వాయువు (ఎల్ఎన్‌జీ) సరఫరాలో 40 శాతం వరకు కోత పడింది. ఫలితంగా ఆయా పరిశ్రమలు గగ్గోలు పెడుతున్నాయి. కొన్ని సంస్థలు ఇతర ప్రత్యామ్నాయాలకు మళ్లే అవకాశం ఉన్నప్పటికీ, అది ఖరీదైన వ్యవహారంగా మారింది. ఖతర్‌తో కుదుర్చుకున్న కాంట్రాక్టు రేటుతో పోలిస్తే స్పాట్ మార్కెట్లో రెట్టింపు రేటుకి కొనుక్కోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఓవైపు సరఫరాలో కోత పడగా మరోవైపు స్పాట్ మార్కెట్లో కూడా దొరికే పరిస్థితి లేకపోవడంతో ప్రాధాన్యత రంగాలపై ప్రతికూల ప్రభావం పడుతోందని గ్యాస్ సరఫరా దిగ్గజం గెయిల్ సీఎండీకి సీజీడీ సంస్థల సమాఖ్య ఏసీఈ లేఖ రాసింది. గృహాలు, సీఎన్‌జీ కస్టమర్లు, చిన్న పరిశ్రమలకు నిరాటంకంగా గ్యాస్ సరఫరా చేసేందుకు తాము కట్టుబడి ఉన్నామని, కాకపోతే గ్యాస్ లభ్యతపై స్పష్టత నివ్వాలని కోరింది.

**ప్రత్యామ్నాయాలపై దృష్టి..**

కీలక రవాణా మార్గమైన హర్మూజ్ జల సంధిలో నౌకలు ప్రయాణించే పరిస్థితి లేకపోవడం వల్ల సరఫరా దాదాపు నిలిచిపోయినట్లు ఖతర్ ఎనర్జీ, పెట్రోనెట్ వెల్లడించాయి. యుద్ధ సమయం కావడం వల్ల కాంట్రాక్టు నిబంధనల ఉల్లంఘనలపరమైన వివాదాలేమీ తలెత్తకుండా లాంఛనంగా ఫోర్స్ మెజూర్ నోటీసులను పరస్పరం ఇచ్చుకున్నాయి. అటు గెయిల్, ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్, భారత్ పెట్రోలియంలకు కూడా ఈ నోటీసులు జారీ చేసినట్లు పెట్రోనెట్ తెలిపింది.దీనితో గెయిల్, ఐఓసీ ప్రత్యామ్నాయంగా స్పాట్ మార్కెట్‌లో కొనుగోళ్ల అవకాశాలను పరిశీలిస్తున్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. అయితే, టర్మ్ కాంట్రాక్టు రేట్లకు రెట్టింపు స్థాయిలో స్పాట్ మార్కెట్లో యూనిట్ (ఎంబీటీయూ) ఎల్ఎన్‌జీ ధర 10 డాలర్ల నుంచి 25 డాలర్లకు ఎగిసినట్లు పేర్కొన్నాయి. గ్యాస్ సరఫరాపరమైన సవాళ్ల వల్ల ఎరువులు, విద్యుత్ తదితర పరిశ్రమలు ఖరీదైన ప్రత్యామ్నాయాలకు మళ్లితే వ్యయాల భారంతో ధరలు పెరిగిపోవచ్చని పరిశ్రమ వర్గాలు తెలిపాయి. ఎరువుల విషయం తీసుకుంటే ప్రభుత్వంపై సబ్సిడీ భారం మరింతగా పెరుగుతుందని పేర్కొన్నాయి.

**సగం అవసరాలకు దిగుమతులే ఆధారం..**

దేశీయంగా గ్యాస్‌ను ఎరువులు, విద్యుదుత్పత్తి మొదలైన వాటి కోసం ఉపయోగిస్తున్నారు. భారత్‌లో కూడా సహజ వాయువును ఉత్పత్తి చేస్తున్నప్పటికీ డిమాండ్‌లో సగానికి మాత్రమే సరిపోతోంది. దీనితో ఎల్ఎన్‌జీని దిగుమతి చేసుకోవాల్సి వస్తోంది. భారత్‌కి ఏటా వచ్చే 27 మిలియన్ టన్నుల ఎల్ఎన్‌జీలో ఖతర్ వాటా 40 శాతం పైగా ఉంటోంది. దేశీయంగా పెట్రోనెట్ ఎల్ఎన్‌జీ సంస్థ అత్యధికంగా దిగుమతి చేసుకుని ఇక్కడ మిగతా కస్టమర్లకు సరఫరా చేస్తోంది. ఏటా 8.5 మిలియన్ టన్నుల ఎల్ఎన్‌జీని కొనుగోలు చేసేందుకు ఖతర్‌తో పెట్రోనెట్‌కి ఒప్పందం ఉంది. స్పాట్ మార్కెట్లో కూడా పెట్రోనెట్ కొనుగోలు చేస్తోంది. ఖతర్‌తో పాటు యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ నుంచి వచ్చే క్రూడాయిల్ మొదలైన వాటికి కూడా హర్మూజ్ జల సంధి కీలక రవాణా మార్గంగా ఉంటోంది. ఇది ఇరాన్ నియంత్రణలో ఉంది. సగటున రోజుకు 91-135 నౌకలు దీని గుండా రాకపోకలు సాగిస్తాయని, కానీ ప్రస్తుతం ఈ సంఖ్య 26కి పడిపోయిందని సంబంధిత వర్గాలు తెలిపాయి.



# సేవల్లో పనితీరు.. ఫ్లాట్

**ఫిబ్రవరిలో పీఎంఐ 58.1 .. 13 నెలల కనిష్ట స్థాయి**

**న్యూఢిల్లీ:** సేవల రంగ కార్యకలాపాలు ఫిబ్రవరిలో కాస్తంత నిదానించాయి. ఈ రంగంలో కార్యకలాపాలను సూచించే హెచ్ఎస్‌బీసీ ఇండియా సర్వీసెస్ పీఎంఐ 58.1 పాయింట్లుగా నమోదైంది. జనవరిలో ఇది 58.5గా ఉంది. 50 పాయింట్లకు పైన ఉన్నంత వరకు విస్తరణగానే పరిగణిస్తుంటారు. డిమాండ్ స్వల్పంగా మెరుగుపడడం, ద్రవ్యోల్బణం పెరగడం ఫలితంగా సేవల రంగం పనితీరు 13 నెలల కనిష్ట వృద్ధికి పరిమితమైనట్లు హెచ్ఎస్‌బీసీ ఇండియా తెలిపింది. ''జనవరితో పోలిస్తే దాదాపు అదే స్థాయిలో ఫిబ్రవరిలోనూ సేవల రంగ పీఎంఐ నమోదు కావడం.. బలమైన పనితీరును సూచిస్తోంది. కొత్త ఆర్డర్లు రాక 13 నెలల కనిష్టానికి తగ్గింది. సేవల రంగం విక్రయాలు అంతర్జాతీయంగా పుంజుకున్నాయి. నిర్వహణ అవసరాల దృష్ట్యా కంపెనీలు నియామకాలు పెంచుకోవడం కనిపించింది''అని హెచ్ఎస్‌బీసీ ఇండియా ముఖ్య ఆర్థికవేత్త ప్రంజుల్ భండారీ తెలిపారు. పోటీ పెరిగిపోవడం వృద్ధిపై ప్రభావం చూపించినట్టు కొన్ని కంపెనీల పర్చేజింగ్ మేనేజర్లు ఈ సర్వేలో భాగంగా వెల్లడించారు. ఫిబ్రవరి నెలకు సంబంధించి కాంపోజిట్ పీఎంఐ (తయారీ, సేవలు కలిసిన) అవుట్‌పుట్ ఇండెక్స్ 58.9కి పుంజుకుంది. జనవరిలో 58.4 పాయింట్లుగానే ఉంది.

# దుబాయ్ దాటని బంగారం



పశ్చిమాసియాలో యుద్ధ ఉద్రిక్తతల ప్రభావం ప్రపంచ బంగారం వ్యాపారంపై పడుతోంది. బులియన్ హబ్‌గా పేరుగాంచిన దుబాయ్ నుంచి విమానాలను సామూహికంగా రద్దు చేయడంతో వ్యాపారులు బంగారం, వెండి రవాణాలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రపంచ బంగారం మార్కెట్లో కీలక కేంద్రంగా నిలిచిన యూఏఈ ఆసియా దేశాలకు బులియన్‌ను శుద్ధి చేసి ఎగుమతి చేయడంలో ప్రధాన పాత్ర పోషిస్తుంది. అంతేకాకుండా స్విట్జర్లాండ్, లండన్ నుంచి రవాణా అయ్యే బంగారం కూడా దుబాయ్ మార్గం ద్వారానే ఆసియాకు చేరుతుంది. అయితే ఇరాన్ చేపట్టిన క్షిపణి దాడుల నేపథ్యంలో యూఏఈ తన గగనతలాన్ని పాక్షికంగా మూసివేయగా, దుబాయ్ విమానాలు నిలిచిపోయాయి. ఫలితంగా ప్రయాణికుల విమానాల కార్గో హోల్డ్‌లలో తరలించే బంగారం, వెండి రవాణా పూర్తిగా నిలిచిపోయింది. దుబాయ్‌కు, వివిధ దేశాలకు మధ్య లోహ రవాణాను నిరవధికంగా నిలిపివేసినట్లు పలువురు వాణిజ్య, లాజిస్టిక్స్ సంస్థల ప్రతినిధులు వెల్లడించారు. తుది గమ్యస్థానాలకు చేరాల్సిన సరుకులను ఇతర మార్గాలకు మళ్లించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. అయితే అధిక విలువ గల బులియన్‌ను రోడ్డు మార్గంలో ఇతర విమానాశ్రయాలకు తరలించడం ప్రమాదకరమని నిపుణులు చెబుతున్నారు.సాధారణంగా ట్రేడింగ్ హబ్‌ల మధ్య బంగారాన్ని ప్రయాణికుల విమానాల ద్వారా తరలిస్తారు. ఇందుకు ఒక్క ట్రిప్‌కు ఔన్సుకు ఒక డాలర్ కంటే తక్కువ ఖర్చు అవుతుంది. ఒక విమానంలో తీసుకెళ్లగల బంగారం పరిమాణానికి బరువుతో కాకుండా విలువ ఆధారంగా పరిమితి ఉంటుంది. బీమా సంస్థలు కూడా ఒక విమానంలో తరలించే కొన్ని టన్నుల విలువైన లోహానికే అండర్‌రైటింగ్ చేస్తాయి.ఈ అంతరాయం తాత్కాలికమే అవుతుందని భావిస్తున్నప్పటికీ, యూఏఈ నుంచి విమానాల నిలిపివేత కొనసాగితే భారత్ సహా ఇతర ప్రధాన మార్కెట్లలో సరఫరా సమస్యలు తలెత్తే ప్రమాదం ఉంది. సౌదీ అరేబియాలో బులియన్ ప్రీమియంలు గణనీయంగా పెరగడం సరఫరాపై ఆందోళనలను ప్రతిబింబిస్తోందని మెటల్స్ ఫోకస్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ ఫిలిప్ న్యూమాన్ తెలిపారు. విమాన ట్రాకింగ్ వేదిక ఫ్లైట్రేడర్24 సమాచారం ప్రకారం.. ఇరాన్ తొలి ప్రతీకార దాడి తర్వాత ప్రపంచవ్యాప్తంగా 12,300కిపైగా విమానాలు రద్దయ్యాయి. ప్రపంచంలోనే అతిపెద్ద అంతర్జాతీయ ఎయిర్‌లైన్‌గా పేరొందిన ఎమిరేట్స్ బుధవారం రాత్రి వరకు దుబాయ్ నుంచి విమానాలను నిలిపివేయగా, ఇతిహాద్ ఎయిర్‌వేస్ గురువారం వరకు కార్యకలాపాలను తాత్కాలికంగా నిలిపివేసింది. గతంలో కూడా ఇలాంటి పరిస్థితులు బంగారం వ్యాపారులను కష్టాల్లోకి నెట్టాయి. 2020లో కరోనా మహమ్మారి ప్రారంభ సమయంలో ప్రయాణ ఆంక్షల కారణంగా లండన్, న్యూయార్క్ నగరాల మధ్య బంగారం రవాణా దెబ్బతింది. ఆ సమయంలో జేపీమోర్గాన్ ఛేస్ వంటి బ్యాంకులకు అపూర్వమైన మధ్యవర్తిత్వ అవకాశాలు లభించాయి.



## దేశం-విదేశం NATIONAL-INTERNATIONAL



# లొంగే ప్రసక్తే లేదు



**మాడ్రిడ్:** ఇరాన్‌పై దాడుల కోసం మీ వైమానిక స్థావరాలను ఉపయోగించుకునేందుకు అనుమతించాలని లేదంటే వాణిజ్య బంధం తెంచుకుంటానని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన హెచ్చరికలను స్పెయిన్ ప్రధానమంత్రి పెడ్రో సాన్‌చెజ్ బేఖాతరు చేశారు. బెదిరింపులకు లొంగే ప్రసక్తేలేదని తెగేసి చెప్పారు. అర్థంలేని యుద్ధంలో భాగస్వాములం కాబోమని స్పష్టంచేశారు. వాణిజ్య బంధాన్ని వదులుకుంటామని ట్రంప్ చేసిన హెచ్చరికలపై పెడ్రో దీటుగా స్పందించారు. బుధవారం టెలివిజన్‌లో దేశ ప్రజలనుద్దేశించి పెడ్రో ప్రసంగించారు. ''ప్రపంచానికి అశుభంగా దాపురించిన పశ్చిమాసియా యుద్ధంలోకి మేం దిగదల్చుకోలేదు. ఈ సమరం అనేది మా దేశ విలువలు, స్వప్రయోజనాలకు పూర్తి విరుద్ధం. ట్రంప్ హెచ్చరికలకు బెదిరిపోయే వాళ్లు ఎవరూ లేరిక్కడ. ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ అన్యాయంగా దాడులు చేస్తున్నాయి. ఇతర దేశాల వ్యవహారల్లోకి సైనిక జోక్యం చేసుకోవడం అనేది అత్యంత ప్రమాదకరం. ఇరాన్‌పై దాడులతో పశ్చిమాసియాలో అత్యంత భీకరమైన యుద్ధం సుదీర్ఘంగా కొనసాగే పెను ప్రమాదం పొంచి ఉంది''అని ఆయన అన్నారు.

**బుల్లెట్ ఎప్పుడు పేలుతుందో తెలీదు..**

''ఇరాక్, అఫ్గానిస్తాన్ విషయాల్లో అమెరికా జోక్యం చేసుకున్నప్పుడూ ప్రపంచం దారుణ విపరిణామాలను ఎదుర్కోవాల్సి వచ్చింది. ఇప్పుడు పశ్చిమాసియాలో యుద్ధంలో భాగస్వాములుకావడం అంటే నిప్పుతో చెలగాటం ఆడినట్లే. రివాల్వర్‌లో ఒక బుల్లెట్ పెట్టి బుల్లెట్ చాంబర్ గిరగిరా తిప్పి కాల్చడం లాంటిది. బుల్లెట్ ఎప్పుడు పేలుతుందో ఎవరికీ తెలీదు. ఈ యుద్ధం ఎప్పుడు ముగుస్తుందో, ఏ దారుణ దిశగా వెళ్తుందో, ఎలాంటి విషాదాలను మిగుల్చుతుందో ఎవరూ ఊహించలేరు. తాజా పరిణామాలపై స్పెయిన్ ప్రభుత్వ వైఖరిని నాలుగు ముక్కల్లో చెప్పాలంటే మేం యుద్ధం అస్సలు చేయదల్చుకోలేదు'' అని ఆయన స్పష్టంచేశారు. దక్షిణ స్పెయిన్‌లోని రోటా, మొరాన్ స్థావరాలను ఎప్పుడంటే అప్పుడు మేం వినియోగించుకోగలమని మంగళవారం ట్రంప్ వ్యాఖ్యానించారు. ''ఈ స్థావరాలను ఉపయోగించకూడదు అని మమ్మల్ని ఎవరూ అడ్డుకోలేరు'' అని ట్రంప్ అన్నారు. యుద్ధంలో భాగస్వాములు కాకపోతే అత్యధిక టారిఫ్‌ల మోత, పరస్పర వాణిజ్యంపై ఆంక్షలు విధించడం వంటి చర్యలు తప్పవని ట్రంప్ హెచ్చరించడం తెల్సిందే. ట్రంప్ వ్యాఖ్యలపై స్పెయిన్ ఆర్థిక మంత్రి కార్లోస్ క్యూయెర్పో స్పందించారు. ''ప్రశాంతంగా ఉండాలని ట్రంప్‌కు సందేశం పంపిస్తా. ట్రంప్ బెదిరింపులకు దిగుతారుగానీ ఆచరణలో ఏమీ ఉండదు'' అని కార్లోస్ ఎద్దేవాచేశారు. అమెరికాతో స్పెయిన్ ఎగుమతి, దిగుమతుల విలువ దేశ జీడీపీలో కేవలం 4.4 శాతానికి సమానం. స్పెయిన్‌కు ఆరో అతిపెద్ద ఎగుమతి మార్కెట్‌గా అమెరికా కొనసాగుతోంది. నాటో దేశాలు తమ జీడీపీలో 5 శాతానికి సమానమైన నిధులను రక్షణ బడ్జెట్ కోసం కేటాయించాలంటూ గతంలో అమెరికా చేసిన ప్రతిపాదననూ స్పెయిన్ ఆనాడే తీవ్రంగా తప్పుబట్టింది. బడ్జెట్ కేటాయింపులు ఏ మేరకు ఉండాలనేది తమ సొంత విషయమని తెగేసి చెప్పింది. దీంతో అధిక టారిఫ్‌లు విధిస్తానని ట్రంప్ ఆనాడే స్పెయిన్‌ను బెదిరించారు.

# ఇరాన్‌పై నిప్పుల వర్షం!

**ఎడతెరిపి లేని దాడులతో విరుచుకుపడ్డ ఇజ్రాయెల్, అమెరికా**

**ఇరాన్ అణు ప్రాజెక్టు కేంద్రం ధ్వంసం**
**ఇజ్రాయెల్, గల్ఫ్ దేశాలపై ఇరాన్ ప్రతిదాడులు**
**దుబాయ్‌లోని యూఎస్ రాయబార కార్యాలయంపై దాడి**
**సౌదీ రాయబార కార్యాలయంపై, రిఫైనరీపై మళ్లీ దాడికి యత్నం**
**టర్కీపై దాడులకు దిగిన ఇరాన్ పశ్చిమాసియాను లక్ష్యం చేసుకుంటాం**
**సైనిక, ఆర్థిక వ్యవస్థల్ని నాశనం చేస్తాం.. రివల్యూషనరీ గార్డ్ తీవ్ర హెచ్చరికలు**



**దుబాయ్:** పశ్చిమాసియాలో యుద్ధం మరింత భీకర రూపు దాలుస్తోంది. ఇరాన్‌తో పాటు లెబనాన్‌పైనా ఇజ్రాయెల్ బుధవారం ఐదో రోజు అక్షరాలా నిప్పుల వర్షం కురిపించింది. ఇరాన్‌లోని కీలక ప్రభుత్వ వ్యవస్థలను నేలమట్టం చేయడమే లక్ష్యంగా టెహ్రాన్‌తో పాటు కోమ్, ఉరోమియా, కెర్మన్‌షా తదితర నగరాలపై కూడా రోజంతా పలు దఫాలుగా బాంబులు, క్షిపణులతో విరుచుకుపడింది. ఇస్ఫహాన్‌లోని క్షిపణి నిల్వల కేంద్రంపై క్షిపణుల వర్షం కురిపించింది. టెహ్రాన్ సమీపంలోని నూతన అణు ప్రాజెక్టు కేంద్రాన్ని పూర్తిగా ధ్వంసం చేసినట్టు ఇజ్రాయెల్ ప్రకటించింది. ఇరాన్‌కు చెందిన వైఏకే-130 యుద్ధ విమానాన్ని టెహ్రాన్ గగనతలంలో కూల్చేసినట్టు సైన్యం వెల్లడించింది. దాడుల ధాటికి తాళలేక దివంగత సుప్రీం నేత అయతొల్లా అలీ ఖమేనీ అంత్యక్రియల కార్యక్రమాన్ని కూడా ఇరాన్ వాయిదా వేసుకుంది! ఇప్పటిదాకా ఇరాన్‌కు చెందిన 17 యుద్ధ నౌకలను పేల్చేసినట్టు అమెరికా ప్రకటించింది. ఇరాన్‌లో 2,000కు పైగా లక్ష్యాలను ఛేదించినట్టు అమెరికా సైన్యం సెంట్రల్ కమాండ్ చీఫ్, నేవీ అడ్మిరల్ బ్రాడ్ కూపర్ వెల్లడించారు. ''వందలాది ఇరాన్ బాలిస్టిక్ క్షిపణులు, లాంచర్లు, డ్రోన్లను నాశనం చేశాం. ఇరాన్ ఇప్పటిదాకా 500కు పైగా బాలిస్టిక్ క్షిపణులు, 2,000కు పైగా డ్రోన్లు ప్రయోగించింది''అని తెలిపారు. ఇరాన్‌లో ఇప్పటిదాకా 1,045 మందికి పైగా మరణించినట్టు ప్రభుత్వ వర్గాలు ప్రకటించాయి. ఇరాన్ సైనిక సామర్థ్యం బాగా క్షీణించిందని ఇజ్రాయెల్ సైన్యం అధికార ప్రతినిధి బ్రిగేడియర్ ఎఫీ డెఫ్రిన్ పేర్కొన్నారు. దాంతో దాడుల తీవ్రత కూడా తగ్గిందని చెప్పుకొచ్చారు. బుధవారం ఇరాన్ కూడా దీటుగా ప్రతి దాడులకు దిగింది. జెరూసలేం తదితర నగరాలపైకి భారీగా క్షిపణులను ప్రయోగించింది. సౌదీ అరేబియా, ఖతర్‌తో పాటు పలు గల్ఫ్ దేశాలపై కూడా దాడులను నిరోస్‌రోధంగా కొనసాగించింది. దుబాయ్‌లోని యూఎస్ రాయబార కార్యాలయంపై డ్రోన్లతో దాడి చేసింది. దాంతో కార్యాలయం భారీ మంటల్లో చిక్కింది. అయితే సిబ్బంది అంతా సురక్షితంగా ఉన్నట్టు అమెరికా తెలిపింది. సౌదీ అరేబియాలోని అమెరికా రాయబార కార్యాలయంతోపాటు అక్కడి రస్ అనూరా చమురు శుద్ధి కేంద్రంపై కూడా మళ్లీ డ్రోన్లతో దాడికి ప్రయత్నించింది. బహ్రెయిన్‌లోని యూఎస్ నేవీ ఐదో ఫ్లీట్ వ్యవస్థపైనా ఇరాన్ క్షిపణుల వర్షం కురిపించింది. అంతేగాక తన దాడులను టర్కీకి కూడా విస్తరించింది! ఇరాన్ నుంచి తమ గగనతలంలోకి దూసుకొచ్చిన బాలిస్టిక్ క్షిపణిని అడ్డుకున్నట్టు టర్కీ ప్రకటించింది. తమపై అకారణ దాడికి దిగిన అమెరికా, ఇజ్రాయెల్‌తో పాటు పశ్చిమాసియా దేశాలు కూడా తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని ఇరాన్ రివల్యూషనరీ గార్డ్ ప్రకటించింది. పశ్చిమాసియాలోని సైనిక, ఆర్థిక వ్యవస్థలన్నింటినీ నాశనం చేసేందుకు సన్నద్ధం అవుతున్నామంటూ తీవ్ర హెచ్చరికలు జారీ చేసింది!

**లెబనాన్‌లో...**

లెబనాన్‌పై దాడుల తీవ్రతను ఇజ్రాయెల్ బుధవారం మరింత పెంచింది. ఎడతెరిపి లేకుండా వచ్చిపడుతున్న క్షిపణులు, బాంబులతో బీరూట్ దద్దరిల్లిపోతోంది. అరమౌన్, సాదియత్ తదితర నగరాలపైనా దాడులు కొనసాగుతున్నాయి. బలైనట్టు తక్షణం సురక్షిత ప్రాంతాలకు వెళ్లిపోవాల్సిందిగా సరిహద్దు ప్రాంతాల్లోని గ్రామవాసులను ఇజ్రాయెల్ హెచ్చరించింది. దాడుల ధాటికి దక్షిణ లెబనాన్‌లో ఇప్పటికే వేలాది మంది నిర్వాసితులుగా మారారు. బాల్‌బెక్‌లో ఓ నివాస సముదాయంపై జరిగిన దాడిలో కనీసం నలుగురు, సాదియత్‌లో ఆరుగురు మరణించినట్టు లెబనాన్ ప్రభుత్వ మీడియా పేర్కొంది.



# నేడు ప్రధానితో ఫిన్లాండ్ అధ్యక్షుడి భేటీ

**నాలుగు రోజుల పర్యటనకు వచ్చిన అలెగ్జాండర్ స్టబ్**

**న్యూఢిల్లీ:** భారత్‌లో నాలుగు రోజుల పర్యటనకు గాను ఫిన్లాండ్ అధ్యక్షుడు అలెగ్జాండర్ స్టబ్ బుధవారం ఢిల్లీకి చేరుకున్నారు. వాణిజ్యం, పెట్టుబడులు, టెక్నాలజీ రంగాల్లో ద్వైపాక్షిక సహకారాన్ని విస్తృతం చేసుకోవడమే లక్ష్యంగా ఆయన ఈ పర్యటన చేపట్టారు. ఢిల్లీకి చేరుకున్న ఆయనకు విమానాశ్రయంలో విదేశాంగ శాఖ సహాయమంత్రి కృతి వర్ధన్‌సింగ్ స్వాగతం పలికారు. స్టబ్ గురువారం ప్రధాని మోదీతో సమావేశ మవుతారు. ఈ సందర్భంగా పలు ఒప్పందాలపై సంతకాలు జరిగే అవకాశాలున్నాయి. గురువారం సాయంత్రం ప్రారంభమయ్యే రైజినా డైలాగ్ సదస్సులో స్టబ్ ముఖ్య అతిథిగా హాజరై కీలక ఉపన్యాసమిస్తారు. స్టబ్ వెంట మంత్రులు, సీనియర్ అధికారులు, వ్యాపార వేత్తలతో కూడిన ఉన్నత స్థాయి ప్రతినిధి బృందం వచ్చింది. అలెగ్జాండర్ స్టబ్ రాష్ట్రపతి ముర్ము, ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్‌లతోనూ భేటీ అవుతారు. శుక్రవారం ముంబైలో వ్యాపారవేత్తలతో సమావేశమవుతారు. శనివారం తిరిగి స్వదేశానికి పయనమవుతారు. ఇటీవల ఢిల్లీలో జరిగిన ఏఐ ఇంపాక్ట్ సదస్సులో ఫిన్లాండ్ ప్రధాని పెట్టెరి ఓర్పో పాల్గొనడం తెల్సిందే. కొన్ని వారాల వ్యవధిలోనే ఆ దేశాధ్యక్షుడు కూడా భారత్ రావడం గమనార్హం.

# బిడ్డ కోసం అమాంతం బావిలోకి దూకేసిన తల్లి..!

**'అమ్మ' గొప్పదనం గురించి ఎంతచెప్పకున్నా తక్కువే. తన ప్రాణాల్ని ఫణంగా పెట్టి మరీ బిడ్డల్ని కాపాడు కుంటుంది. తరతరాల చరిత్ర ఈ సత్యాన్ని పదే పదే నిరూపిస్తూనే ఉంది. పిల్లల్ని కాపాడటానికి తల్లి తన ప్రాణాలను పణంగా పెట్టినల సంఘటనలు చాలానే ఉన్నాయి. తాజాగా చెన్నైలో జరిగిన ఒక ఉదంతం బిడ్డలపై తల్లి ప్రేమ, చూపించే ధైర్య సాహసాలపై మరోసారి చర్చకు తావిచ్చింది. మాతృత్వం గౌరవాన్ని మరింత ఇనుపడింపజేసిన ఈ సంఘటన మంగళవారం జరిగింది.**

ఇండియా టుడే రిపోర్ట్ ప్రకారం తమిళనాడులోని నంబియూర్ సమీపంలో అయియంకట్టు తొట్టంలో తన కూతురిని కాపాడటానికి 55 ఏళ్ల మహిళ లోతైన బావిలోకి దూకేసింది. ఊంజపాళయంకు చెందిన సుందరం కుమార్తె దివ్య (27) స్పెషల్ నీడ్ చైల్డ్. ఇందుకోసం చికిత్స కూడా పొందుతోంది. ఆత్మహత్య చేసుకోవాలని ఆమె బావిలోకి దూకేయడంతో అక్కడే ఉన్న తల్లి ముత్తుమణి క్షణం కూడా ఆలోచించికుండా కూతుర్ని కాపాడేందుకు సాహసానికి పూనుకుంది. వెంటనే తాను కూడా బావిలోకి దూకేసి, కుమార్తెను గట్టిగా పట్టుకుంది. సహాయం కోసం ఆమె వేసిన కేకలు ఆ ప్రాంతం అంతటా ప్రతిధ్వనించాయి. దీంతో పొరుగువారు అప్రమత్తమై కద్దూర్ పోలీసులకు, నంబియూర్ అగ్నిమాపక విభాగానికి సమాచారం ఇచ్చారు. వారు వచ్చేదాకా ఆమె బిడ్డను కాపాడుకుంది. ఇంతలో సంఘటనా స్థలానికి చేరుకున్న సహాయ సిబ్బంది ఇద్దరినీ సురక్షితంగా బయటకు తీసుకురావడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. అలాగే ముత్తుమణి ధైర్యాన్ని స్థానికులు ప్రశంసలు కురిపించారు. తల్లీ బిడ్డల్ని కాపాడిన అగ్నిమాపక శాఖ కృషిని కూడా కొనియాడారు ఈ సంఘటనపై పోలీసులు సాధారణ విచారణ ప్రారంభించారు.



# లావుగా ఉన్నానని..

ధురంధర్ సినిమాలో యాక్ట్ చేసిన ప్రతి ఒక్కరూ ప్రశంసలు అందుకుంటున్నారు. ఈ చిత్రంలో షరారత్ అంటూ సాగే ఐటం సాంగ్‌లోనూ అదిరిపోయే స్టెప్పులతో అలరించి ఫేమ్ తెచ్చుకుంది ఆయేషా ఖాన్. అయితే గతంలోనూ ఓ సాంగ్‌లో కనిపించాల్సిందని, కానీ లావుగా ఉన్న కారణంతో తనను రిజెక్ట్ చేశారని చెప్తోంది.

## సడన్‌గా తీసేశారు

తాజాగా ఓ ఈవెంట్‌లో ఆయేషా ఖాన్ మాట్లాడుతూ.. టీ సిరీస్ బ్యానర్ నుంచి వచ్చిన ఓ పాటలో నేను సెకండ్ హీరోయిన్‌గా చేయాల్సింది. అప్పుడు నేను పన్నెండో తరగతి చదువుతున్నాను. తెల్లారితే షూటింగ్ అనగా రాత్రికి రాత్రే నన్ను తీసేశారు. నేను లావుగా ఉన్నానని సాకు చూపించారు.

## నిజంగా బాధాకరం

ఇప్పటికీ ఇన్‌స్టాగ్రామ్‌లో నా శరీరం గురించి రకరకాలుగా కామెంట్లు చేస్తూనే ఉంటారు. నేను స్కర్ట్ వేసుకున్నా, కుర్తా ధరించినా.. ఎలాంటి దుస్తులు ధరించినా తప్పపడుతూనే ఉంటారు. ఏది పోస్ట్ చేయాలన్నా ఒకటికి రెండుసార్లు ఆలోచించాల్సి వస్తుంది. ఇది నిజంగా బాధాకరం. ఎవరేమనుకుంటే నాకేంటి? నాకు నచ్చింది పోస్ట్ చేయాలనిపిస్తుంది. కానీ వాళ్లు హద్దులు దాటి మరీ కామెంట్స్ చేస్తారు.

## ఫేమస్ కాకపోయుంటే..

అత్యాచారం చేస్తామని బెదిరిస్తారు. ఈ బెదిరింపులు నాకు రోజూ వస్తాయి. ఇలాంటి మనుషుల మధ్య ఉన్నందుకు భయంగా ఉంది. ఇలాంటివాళ్లకు ఏదో ఒక రకంగా బుద్ధి చెప్పాలన్నంత కోపం వస్తుంది. వాళ్లనే మాటలు కొన్నిసార్లు నా గాయాలను గుర్తు చేస్తాయి. నేను ఇంత ఫేమస్ కాకపోయుంటే నిజంగానే అన్నంత పని చేసేవారేమో అని భయమేస్తుంది అని ఆయేషా చెప్పుకొచ్చింది. సీరియల్స్‌లో చిన్నాచితకా పాత్రలు చేసింది ఆయేషా ఖాన్. హిందీ బిగ్‌బాస్ 17వ సీజన్‌తో గుర్తింపు తెచ్చుకుంది. ముఖచిత్రం మూవీతో తెలుగు వెండితెరకు పరిచయమైంది. ఓం భీమ్ బుష్, మనమే సినిమాల్లోనూ చిన్న పాత్రలు పోషించింది. హిందీలో జాట్, కిస్ కిస్కో ప్యార్ కరూన్ 2 సినిమాలు చేసింది.



EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com